ఉక్రేనియన్ జానపద గాథలు - 3

# తెలివైన కూతురు



ఉక్రేనియన్ జానపద గాథలు - 3

# తెలివైన కూతురు

అనువాదం : ఆర్వీయార్

మంచి పుస్తకం

Ukrainian Folk Tales

**ఉక్రేనియన్ జానపద గాథలు - 3**

**తెలివైన కూతురు**

అనువాదం : ఆర్వీయార్

బొమ్మలు : వి. గొర్‌దియ్‌చుక్

“రాదుగ” ప్రచురణాలయం ద్వారా 1988లో సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ప్రచురణ : సెప్టెంబరు, 2011

ప్రతుల సంఖ్య : 3000

వెల : రూ. 27/-

ISBN : 978-93-80153-58-2

ప్రచురణ, ప్రతులకు :

**మంచి పుస్తకం**

12-13-439, వీధి నెం. 1

తార్నాక, సికింద్రాబాదు - 500 017

ఫోన్ : 94907 46614.

email : info@manchipustakam.in

website : www.manchipustakam.in

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

1-9-1126/బి, అజామాబాద్,

హైదరాబాదు - 500 020.

ఫోన్ : 040 - 2767 8411

# కథా క్రమం

ముందు మాట

1. తెలివైన కూతురు ..... 05
2. న్యాయం అన్యాయం ..... 12
3. ముసలాయన కూతురూ ముసలామెకూతురూ ..... 19
4. ఓహ్ ..... 30

అద్భుత లోకం గురించీ, ఆ లోకంలోని వీరుల గురించీ చెప్పే కమనీయ జానపద గాథలు ఒక తరాన్నించీ ఇంకో తరానికి ఏనాటినుంచో అందుతూనే ఉన్నాయి. లోకుల యుక్తి, చమత్కారం, హాస్యం తొణికిసలాడే గాథలు ఇవి. చాలా కాలం అవి మౌఖికంగానే ఉండిపోయాయి. శ్రోతలకి వాటిని వినిపించేవారు. అందుకనే వాటికి గాథలని పేరు వచ్చింది.

ఉక్రేనియన్ జానపద గాథలు అపారంగా ఉన్నాయి. పాతకాలం నాటి వీరుల్నీ, సంఘటనల్నీ ఈ గాథల్లో అడుగు అడుగునా మనం చూస్తాం. సామాన్య ప్రజలలో ధైర్యం ఉన్న మనుషులూ, ఉల్లాసం కలిగించే సాహసకృత్యాలు, చలాకీగా ఉండే జంతువులూ, పక్షులు పాఠకులకి సంతోషం కలిగిస్తాయి.

ప్రకృతి గురించీ, పెంపుడు జంతువుల గురించీ, అడవి జంతువుల గురించీ, పక్షుల గురించీ ప్రాథమిక జ్ఞానాన్ని జానపద గాథలు పిల్లలకి అందిస్తాయి.



# తెలివైన కూతురు

పూర్వం ఒకప్పుడు ఇద్దరు అన్నదమ్ములు ఉండేవాళ్లు. అన్న సంపన్నుడు, తమ్ముడు బీదవాడు. తమ్ముడి దగ్గర తినడానికి కూడా లేదనీ, పిల్లలకివ్వడానికి పాలు కూడా లేవనీ బాధపడి అన్న ఒక ఆవుని ఇచ్చాడు.

"నా దగ్గర పని చేసి బాకీ తీర్చుకోవచ్చులే తమ్ముడూ," అని అన్న చెప్పాడు.

అన్నకి పని చేసి పెట్టి మొత్తం బాకీ అంతా బీద తమ్ముడు తీర్చేశాడు. ఇక ఆవుని వెనక్కి తీసేసుకుందామన్న ఆలోచనతో తమ్ముడిని ఆవుని ఇమ్మని అన్న అడిగాడు.

"కాని, అన్నయ్యా, నీకు ఎంత కాలం, ఎంత కష్టపడి పని చేశాను," అన్నాడు తమ్ముడు.

"దాన్ని పని అంటావా! ఏమీ చెయ్యలేదు. నా ఆవుని నాకు తిరిగి ఇచ్చెయ్యి. అంతే," అన్నాడు అన్న.

ఒట్టి పుణ్యానికి అంత కాలం బానిస చాకిరీ చేసి ఆవుని వదులుకోవడం తమ్ముడికి నచ్చలేదు. అందుకని అన్నదమ్ములు ఇద్దరూ ప్రభువు దగ్గరకి వెళ్లి తమకి న్యాయం చెప్పమని అడిగారు.

"నేను మిమ్మల్ని మూడు ప్రశ్నలు అడుగుతాను. జవాబు ఎవరు చెపుతారో వాళ్లకి ఆవు దక్కుతుంది," అన్నాడు.

"సరే అయితే అడగండి," అన్నారు వాళ్లు.

"వినండి. మొదటి ప్రశ్న: అన్నిటికంటే బాగా కడుపు నింపేది ఏది? రెండవది: మనిషికి మహా సంతోషకారకమైంది ఏది? మూడవది: అన్నిటికంటే వేగవంతమైంది ఏది? వెళ్లి వీటి గురించి ఆలోచించి రేపు పొద్దున వచ్చి జవాబులు చెప్పండి."

అన్నదమ్ములిద్దరూ వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లే దారిలో సంపన్నుడైన అన్న అనుకున్నాడు.

“ఏం పిచ్చి ప్రశ్నలు! మూడూ మూడే! వీటిని గురించి ఆలోచించడం కూడానా! కడుపుని నింపేది పంది మాంసం, మహా సంతోషకారకమైంది డబ్బు, మహా వేగవంతమైంది వేట కుక్క. ఇంకేముంది ఆవు నాదే!” అనుకున్నాడు.

కాని బీద తమ్ముడికి ఏం తట్టలేదు. తల వేలాడేసుకుని చాలా దిగాలు పడిపోయి ఇంటికి వెళ్లాడు.

అతనికి మరియ అనే కూతురు ఉంది. తండ్రి విచారంగా పాలిపోయి ఉండడం చూసి, ఏమి అలా ఉన్నారని అడిగింది.

“ప్రభువు మూడు ప్రశ్నలు అడిగాడు. వాటికి జవాబులు చెప్పాలి. ఈ జన్మకి నేను నెగ్గలేను,” అన్నాడు.

“ఏమిటా ప్రశ్నలు నాన్నా?” అని అడిగింది.

“మొదటిది: అన్నిటికంటే బాగా కడుపు నింపేది ఏది? రెండవది: మనిషికి మహా సంతోషకారమైంది ఏది? మూడవది: అన్నిటికంటే వేగవంతమైంది ఏది?”

“ఓస్, ఇంతేనా! అన్నిటికంటే బాగా కడుపు నింపేది భూదేవి. ఏమంటే మనందరికీ తిండి పెట్టేది భూమాతే. మనసులోని ఊహ అన్నిటికంటే వేగవంతమైంది. ఎక్కడికైనా మనల్ని రెప్పపాటులో తీసుకు పోతుంది. నిద్ర అన్నిటికంటే మహా సంతోషకారకమైంది. ఏమంటే మనం ఎంతో అపురూపంగా చూసుకునే వాటిని కూడా నిద్ర కోసం వదిలేస్తాం.”

“నిజమేనమ్మా! ప్రభువుకి ఈ జవాబులే చెపుతాను,” అన్నాడు అతను.

ఆ మర్నాడు పొద్దుట అన్నదమ్ములిద్దరూ ప్రభువుని చూడడానికి వెళ్లారు. తను అడిగిన వాటికి జవాబులు దొరికాయా అని ప్రభువు అడిగాడు.

“ఆఁ!” అని వాళ్లు బదులిచ్చారు.

ముందు సమాధానం చెప్పేసి, ఆవును తీసేసుకోవాలని అన్న అనుకున్నాడు.

“కడుపు నింపేది పంది మాంసం. సంతోషకారకమైంది డబ్బు. మహా వేగంగా వెళ్లేది మీ వేట కుక్క.”

“తప్పు, తప్పు, శుద్ధ తప్పు,” అని ప్రభువు తమ్ముడికేసి తిరిగాడు.

"ఊc, నువ్వు చెప్పగలవేమో చూద్దాం," అన్నాడు.

"కడుపు నింపేది భూమాత. ఏమంటే మనిషికి జీవితాంతం తిండి పెట్టేది భూదేవే కదా."

"బాగా చెప్పావ్. మరి మహా వేగవంతమైంది ఏది?" అని ప్రభువు అడిగాడు.

"మనసులోని ఊహ. రెప్పపాటులో మనిషిని ఎక్కడికైనా తీసుకుపోతుంది."

"బాగుంది. మహా సంతోషకరమైంది ఏది?"

"నిద్ర. ఏమంటే నిద్ర కోసం మనిషి తను అపురూపంగా చూసుకునే ప్రతి దాన్నీ వదిలేస్తాడు."

"చాలా బాగుంది. ఆవు నీదే. కాని ఈ ప్రశ్నలకి జవాబు కనిపెట్టడానికి నీకు ఎవరు సాయం చేశారు?"

"మా అమ్మాయి మరియ."

ప్రభువుకి చర్రున కోపం వచ్చింది.

"నేను ఎంతో వివేకవంతుడిని. ఒక సామాన్యురాలైన అమ్మాయి నా అంత తెలివైంది అనే విషయాన్ని సహించడమే! ఫో, ఇంటికి వెళ్లు. మీ అమ్మాయికి ఉడకపెట్టిన ఈ పది గుడ్లనీ ఇయ్యి. వాటిని పొదిగించి పది కోడి పిల్లలు పెట్టించాలి. బాగా మేపి నా ఫలహారానికి మూడింటిని వేయించి తేవాలి. నేను నిద్రలేవగానే అవి తయారుగా ఉండాలి. ఈ పని చెయ్యకపోతే నీకు శిక్ష పడుతుంది," అన్నాడు.

తమ్ముడు చాలా విచారంగా ఇంటికి వెళ్లాడు. అతని కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

"ఏం నాన్నా, కళ్ళల్లో నీళ్లు?" అని కూతురు అడిగింది.

"ఏం చెయ్యనమ్మా! ప్రభువు ఉడకపెట్టిన పది గుడ్లు ఇచ్చాడు. తెల్లవారేలోపు వాటిని పొదిగించి పది కోడి పిల్లల్ని చేసి బాగా మేపి మూడింటిని ఆయన ఫలహారానికి వేయించి తీసుకుని వెళ్లాలి," అన్నాడు.

మరియ చిరునవ్వు నవ్వింది.

ఆమె తండ్రికి ఒక కడవ పాయసం ఇచ్చింది.

"నాన్నా, ఈ కడవని ప్రభువు దగ్గరకి తీసుకువెళ్లు, ఒక మడి దున్ని ఈ పాయసం అక్కడ నాటి ధాన్యం కోతకి రాగానే నూర్చి సిద్ధంగా ఉంచమను. కోడి పిల్లలు గుడ్లనుంచి బయటికి రాగానే వాటికి మేత కావాలి కదా," అంది.

తమ్ముడు కూతురు చెప్పినట్టే చేశాడు. పాయసం కడవని ప్రభువు దగ్గరకి తీసుకువెళ్లి కూతురు చెప్పిన మాటలని తు.చ. తప్పకుండా వల్లించాడు.

ప్రభువు పాయసంకేసి చూశాడు. మళ్లీ చూశాడు. తరవాత దాన్ని కుక్కలకి పారబోశాడు. అప్పుడు ఒక జనపకాడని తమ్ముడికి ఇచ్చాడు.

"దీన్ని తీసికెళ్లి నీ కూతురికి ఇవ్వు. దీన్ని నానబెట్టి, ఆరేసి, నార తీసి వంద మూరల బట్టని వడకమను. ఆ పని చెయ్యకపోతే నీ పని సరి," అన్నాడు.

అతను ఇంటికి బయలుదేరాడు. అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇంటికి వెళ్లగానే మరియ ఎదురైంది. ఎందుకు ఏడుస్తున్నాడో కారణం అడిగింది.

"ఏం చెయ్యమంటావు తల్లీ! ప్రభువు ఈ జనపకాడని ఇచ్చాడు. దీన్ని నానబెట్టి, ఆరేసి, నార తీసి వంద మూరల బట్టని వడకాలట."

ఆ అమ్మాయి అతను చెప్పే దాన్ని సావధానంగా విన్నది. ఒక బాకు తీసుకుని, అవతలికి వెళ్లి అతి సన్నటి రెమ్మని ఒక చెట్టునుంచి కోసి తెచ్చి తండ్రికి ఇచ్చింది.

"ఈ రెమ్మని తీసుకువెళ్లి ప్రభువుకి ఇవ్వు నాన్నా. దీంతో నారని చిక్కు తీసే దువ్వెననీ, నారని చుట్టే పంటెనీ తయారు చేసి ఇమ్మను. నేను నార వడుకుతాను," అంది.

తమ్ముడు రెమ్మని తీసుకుని ప్రభువు దగ్గరకి వెళ్లాడు. కూతురు చెప్పిన సంగతి ప్రభువుతో చెప్పాడు.

ప్రభువు రెమ్మని పరకాయించి చూశాడు. అప్పుడు దాన్ని అవతలికి విసిరేశాడు.

'ఈ అమ్మాయిని రోకరా కొట్టించడం కష్టం,' అనుకున్నాడు. ప్రభువు బాగా ఆలోచించి తమ్ముడికేసి తిరిగాడు.

"మీ అమ్మాయిని నా దగ్గరకి పంపించు. కాని జాగ్రత్త. ఆమె పరిగెత్తకూడదు, సవారీ రాకూడదు. ఒట్టిపాదంతో నడవకూడదు, చెప్పులు వేసుకోకూడదు. కానుకలు తేకూడదు, తేకుండానూ ఉండకూడదు. ఇలా చెయ్యకపోతే ఆ పిల్ల పని పడతా," అన్నాడు ప్రభువు.

తమ్ముడు ఇంటికి వెళ్లిపోయాడు. అతని కళ్లనుంచి నీళ్లు జలజలా రాలుతున్నాయి.

"ఏం చెయ్యగలం తల్లీ! చూడు ప్రభువు ఏం చెయ్యమని పూరమాయిస్తున్నాడో," అన్నాడు.

ప్రభువు చెయ్యమని చెప్పినదంతా కూతురుతో చెప్పాడు.

"బాధ పడొద్దు, నాన్నా, మనం నెగ్గుతాం. వెళ్లి బతికి ఉన్న కుందేలుని కొనుక్కు రా," అని చెప్పింది మరియ.

కూతురు చెప్పినట్టే బతికి ఉన్న కుందేలుని కొనుక్కొచ్చాడు. ఆ అమ్మాయి వెంటనే ప్రయాణానికి సిద్ధమైంది. మొదట ఆమె ఒక స్లెడ్జిని తెచ్చింది. ఒక మేకని దానికి కట్టింది. తరవాత ఒక పిచ్చుకని పట్టింది. అప్పుడు ఒక కాలుకి చెప్పు తీసేసి, రెండో కాలికి చెప్పు తగిలించుకుంది. ఇదంతా అయ్యాక కుందేలుని చంకలో పెట్టుకుని ఒక కాలు స్లెడ్జిలో పెట్టి, రెండో కాలు నేలమీద ఆనించి పిచ్చుకని గట్టిగా చేత్తో పట్టుకుని ప్రభువు దగ్గరకి బయలుదేరింది.

ప్రభువు ఆమెని చూశాడు. ఆ అమ్మాయి తన ఎత్తుగడకి మించి ఎత్తు వేసిందని గ్రహించాడు. ఆమె మీదకి కుక్కల్ని ఉసిగొల్పమని నౌకర్లని ఆజ్ఞాపించాడు. ఆమె కుందేలుని వదిలి పెట్టగానే కుక్కలు ఆమెని వదిలేసి కుందేలు వెనక పడ్డాయి. అప్పుడు ఆమె ప్రభువు ఇంట్లోకి వెళ్లి నమస్కారం అంది.

"ప్రభూ మీకో చిన్న కానుక తెచ్చాను," అంది. ఆమె ప్రభువుకి పిచికని అందివ్వబోయింది. ప్రభువు దాన్ని అందుకునే లోపలే అది రెక్కలు టపటప లాడించి తుర్రున కిటికీలోనుంచి ఎగిరి పోయింది.

సరిగ్గా ఆ సమయంలో ప్రభువు దర్శనార్థం ఇద్దరు మనుషులు వచ్చారు. వాళ్లు తమలో ఎవరు ఒప్పో, ఎవరు తప్పో తగువు తేల్చమని అడగడానికి వచ్చారు.

"మీ తగువు ఏమిటో చెప్పండి," అని అడిగాడు.

"ప్రభూ! ఈ మనిషీ, నేనూ పొలంలో పడుకున్నాం. లేచే వేళకి నా గుర్రం ఈనడం చూశాం..." అని ఒక వ్యక్తి మొదలుపెట్టాడో లేదో రెండో అతను అందుకున్నాడు.

"అబద్ధం. నా గుర్రం ఈనింది," అన్నాడు.

ప్రభువు ఏం చెప్పాలా అని ఆలోచించాడు.

"ఆ గుర్రాలనీ, పిల్లనీ తీసుకు రండి. పిల్ల తల్లి దగ్గరకి వెళుతుంది. అప్పుడు తగవు తేలుస్తాం," అన్నాడు.

గుర్రాలని పెరట్లోకి తీసుకు వచ్చారు. వాటిని కట్టేసి పిల్లని వదిలిపెట్టారు. ఈ తగవు తీర్చమని వచ్చిన పెద్ద మనుషులిద్దరూ ఇటు రా, ఇటు రా అని ఆ గుర్రపు పిల్లని పిలవడం మొదలుపెట్టారు.



దాంతో దానికి దిక్కు తోచక పెరట్లోనుంచి బయటికి పారిపోయింది. ఏం చెయ్యాలో ఎవరికీ తోచలేదు. అందరూ నోళ్లు వెళ్లబెట్టి చూస్తూ ఉండిపోయారు. అప్పుడు మరియ ముందుకు వచ్చింది.

"ఇలా కాదు చెయ్యవలసింది. గుర్రాలని వదిలెయ్యండి. పిల్లని కట్టెయ్యండి. అప్పుడు తల్లి గుర్రం దాని దగ్గరకి వెళుతుంది," అని చెప్పింది.

ఆమె చెప్పినట్టే చేశారు. గుర్రాల కట్టు తాళ్లు విప్పెయ్యగానే తల్లి గుర్రం పిల్ల దగ్గరకి సరాసరి పరిగెత్తింది.

ప్రభువు ఆ అమ్మాయిని ఇంటికి వెళ్లిపోనిచ్చాడు. తనకంటే ఆ అమ్మాయి తెలివైందనీ, తను ఎన్నటికీ ఆమెని ఓడించలేననీ గ్రహించాడు.





# న్యాయం అన్యాయం

ఒకప్పుడు ఇద్దరు అన్నదమ్ములు ఉండేవాళ్ళు. అన్న కలవాడు, తమ్ముడు పేదవాడు. ఒక రోజున ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు.

"ఏది ఎలా ఉన్నా న్యాయంగా ఉండేవాళ్లే బాగా బతుకుతారు," అని తమ్ముడు అన్నాడు.

"న్యాయం గీయం ఎక్కడున్నాయి ఈ రోజుల్లో, వాడికీ వీడికీ తగువులుపెట్టే వాళ్లే బాగుంటారు. అన్యాయంగా ఉండేవాళ్లే బాగా బతుకుతారు," అన్నాడు అన్న.

"లేదన్నా, న్యాయమే నెగ్గుతుంది," అన్నాడు తమ్ముడు.

"ఊఁ, సరే అయితే. దారిలో ఎదురైన ముగ్గురిని అడుగుదాం. వాళ్లు నీ పక్షం చెపితే నా ఆస్తి అంతా నీదే, నా పక్షం చెపితే నీ ఆస్తి నాదే. ఏం?" అన్నాడు అన్న.

"సరే," అన్నాడు తమ్ముడు.

వాళ్లు బయలుదేరి వెళ్లారు. అలా నడిచీ నడిచీ వెళ్లగా వాళ్లకి ఒకతను కనిపించాడు. అతను కూలివాడిలా ఉన్నాడు. పనయ్యాక ఇంటికి తిరిగి వెళుతున్నట్టు ఉన్నాడు. అన్నదమ్ములు అతన్ని "న్యాయమా, అన్యాయమా ఏది మెరుగు?" అని అడిగారు.

"అయ్యో, బాబులూ! మీరే లోకంలో ఉన్నారు? ఈ రోజుల్లో ఎన్నడన్నా న్యాయం మీకు కనిపించిందా! నన్ను చూడండి. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పని చేస్తాను. మా కామందు బొజ్జ పెరిగిపోతోంది, కాని నా పని గొర్రె తోకలాగే ఉంది. పైగా నాకు పిచ్చి కుంచాలతో కొలుస్తాడు. అంచేత న్యాయం గీయం లాభం లేదండి బాబులూ. అన్యాయం వాళ్లకే రోజులు!" అన్నాడు.

“అదిగో, చూశావా, నేనన్న మాట కాదన్నావ్,” అని అన్న పొంగిపోవడం మొదలుపెట్టాడు. తమ్ముడికి తన ఆస్తి ఎక్కడ పోతుందోనని దిగులు మొదలైంది.

తరవాత వాళ్లకి ఒక జమీందారు తగిలాడు.

“దండాలయ్యా! న్యాయమా, అన్యాయమా ఏది బాగుంటుంది?” అని అడిగారు.

“అయ్యో బాబులూ! న్యాయంగా ఉండేవాళ్లు ఈ రోజుల్లో ఎక్కడున్నారయ్యా! అలాంటి వాళ్లు కాగడా వేసి వెతికినా ఎక్కడా కనిపించరు. అన్యాయంగా ఉండడమే చాలా మెరుగు,” అని చెప్పాడు.

“అదుగో, చూశావా! ఈసారి కూడా నా మాటే నెగ్గింది,” అన్నాడు అన్న సంతోషంతో.

తమ్ముడికి దిగులు ఇంకా ఎక్కువైంది.

వెళ్లగా వెళ్లగా వాళ్లకి ఒక వ్యాపారి తగిలాడు.

“నమస్కారం అయ్యా! న్యాయమా, అన్యాయమా వీటిలో ఏది బాగుంటుంది?” అని అడిగారు.

“నాయనలారా! ఈ రోజుల్లో న్యాయం ఎక్కడ ఉందయ్యా! అలాంటి వాళ్లు కాగడా పెట్టి వెతికినా కూడా కనిపించరు. అన్యాయంగా ఉండేవాళ్లకి రోజులివి. వ్యాపారం చూడండి, మోసం లేకపోతే బేరం లేదు,” అన్నాడాయన.

“అద్గదీ, చూశావా! ముచ్చటగా మూడోసారి కూడా నా మాటే నెగ్గింది,” సంతోషంతో ఉబ్బితబ్బిబ్బు అయిపోతూ అన్న అన్నాడు.

ఇక చేసేదేమీ లేకపోయింది. తమ్ముడి ఆస్తి అంతా అన్న పరం అయింది. తమ్ముడికి కట్టు బట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. అతను ఆకలికి నకనకలాడి పోయాడు. చెప్పరాని కష్టాలు పడ్డాడు. ఇక ఓపిక నశించిపోయి ఉరిపోసుకు చచ్చిపోదామనుకున్నాడు. పొడుగాటి తాడు తీసుకొని అడవిలోకి వెళ్లాడు. దిట్టమైన మాంచి చెట్టుని చూసి, తాడు కడితే ఆగే కొమ్మ కోసం వెతికాడు.

“ఆ కొమ్మ బలంగా ఉన్నట్టుంది. తాడుని నా మెడకి తగిలించుకున్నాక దానిని గట్టిగా పట్టుకోవచ్చు,” అనుకున్నాడు.

అతను చెట్టుమీదనుంచి కళ్లు తిప్పి ఒకసారి పక్కకి చూశాడు, అంతే! మూరెడు దూరంలో తోడేలు ఒకటి కనిపించింది. అతనికి విపరీతమైన భయం పుట్టింది. తాడు కిందే వదిలేసి గబగబ చెట్టుపైకి ఎక్కేశాడు.

అతను చెట్టుమీద కూర్చున్నాడు. ఇంతలో మూడు పిశాచాలు అక్కడికి వచ్చాయి. ఆ తరవాత కొంచెం సేపటికి నాయక పిశాచం వచ్చింది.



మొదటి పిశాచాన్ని “ఏం చేశావ్ ఇవాళ?” అని అది అడిగింది.

“నేను కలిగించిన నష్టం పూడ్చడం అసాధ్యం, నాయకా. ఒక ఆనకట్టని బద్దలు కొట్టాను. అక్కడి ప్రభువుకి ఆగ్రహం నసాళానికి ఎక్కేసింది. దాన్ని బాగు చెయ్యలేనందుకు పనివాళ్లని పిచ్చెక్కినట్టు చావ మోదుతున్నాడు. ఆ దెబ్బలకి చాలా మంది హరీ అంటారు. ఆ పీనుగులన్నీ మనకే దక్కుడు,” అని మొదటి పిశాచం చెప్పింది.

“బాగానే చేశావు కాని అంత బాగా కాదు,” అంది నాయక పిశాచం.

“ఎందుక్కాదు, నాయకా?”

“అడవిలోని వాగు దగ్గర మూడు చెట్లు పెరుగుతున్నాయి. వాటిని కొట్టి తీసికెళ్లి అడ్డం పడేస్తే ఆనకట్టలాగే ఉంటాయి.”

“అదెవడికి తెలుస్తుంది, ఎవరు కలగంటారు!” అంది మొదటిది.

పిశాచం నాయకురాలు రెండో దానికేసి తిరిగింది.

“ఇవాళ నువ్వేం చేశావ్?” అని అడిగింది.

“నేను కలిగించిన నష్టం పూడ్చలేనటువంటిది, నాయకా! అడవి అవతల బస్తీలో ఉన్న బావుల్లోని నీళ్లు అన్నిటినీ ఇగిర్చేశాను. ఒక్క నీటి చుక్క లేదక్కడ. ఊరి వాళ్లు బావి కోసం ముప్పై మైళ్లు వెళ్లాలి. చాలా మంది దాహం వేసి చచ్చిపోతారు. ఆ పీనుగలన్నీ మనకే దక్కుతాయి,” అంది.

“బాగానే చేశావ్, కాని అంత బాగా కాదు.”

“ఎందుకని?”

“బస్తీ మధ్యలో ఒక చిన్న కొబ్బరితోట ఉంది. దాన్ని తవ్వితే పాతాళ గంగ జల తన్నుకుంటూ పైకి ఎగజిమ్ముతుంది. ఊరి వాళ్లకి అది చాలు,” అంది మొదటి పిశాచం.

“ఆఁ, ఎవడికి తెలుస్తుంది, ఎవడు కలగంటాడు,” అంది ఆ పిశాచం.

అప్పుడు నాయక పిశాచం మూడో పిశాచంకేసి తిరిగింది.

“ఊఁ, నువ్వేం చేశావ్ ఇవాళ?” అని అడిగింది.

“అబ్బో, నేను కలిగించిన నష్టాన్ని పూడ్చడం ఎవరివల్లా కాదు. ఈ అడవి అవతల ఒక రాజ్యం ఉంది. ఆ రాజుగారికి ఒక్కగానొక్క కూతురు ఉంది. ఆమెకి ఎంతటి జబ్బు సోకేట్టు చేశానంటే ఎవరూ దాన్ని నయం చెయ్యలేరు. ఆమె శవం మనకే,” అంది.

“బాగానే చేశావ్ కాని అంత బాగా కాదు,” అంది నాయక పిశాచం.

“ఎందుకని?”

"దురదగొండి మొక్కల్ని కోసుకుని వెళ్లి ధూపం వేసి, జబ్బు మనిషి గది నిండా ఆ ధూపం నింపితే ఆమెకి నయమవుతుంది."

"ఆఁ! ఇదెవడికి తెలుసు? ఎవడు కలగంటాడు?" అంది. తరవాత ఆ పిశాచాలు వెళ్లిపోయాయి. చెట్టుమీద కూర్చున్న తమ్ముడు ఒక్క మాట కూడా పొల్లు పోకుండా విన్నాడు.

"ఇవి అనుకున్న మాటలు నిజమేనేమో! వెళ్లి ఆనకట్టని బాగు చెయ్యవచ్చేమో చూస్తాను," అని అనుకున్నాడు.

పిశాచాలు ఆనకట్ట ఉందన్న చోటుకి అతను వెళ్లాడు. అక్కడి ప్రభువు కూలీల్ని చితక పతకా చావ మోదుతున్నాడు. ఇంకా గబగబా పని చెయ్యమని తొందర పెడుతున్నాడు. పని వాళ్లు పిసరు కూడా ఒళ్లు దాచుకోకుండా పని చేస్తున్నారు. చెమటలు కక్కేస్తున్నారు. కాని ఏం లాభం లేకుండా ఉంది.

తమ్ముడు ప్రభువు దగ్గరికి వెళ్లాడు.

"కూలీల్ని చావదన్నితే ఆనకట్ట బాగవుతుందా? ప్రభూ! తమరి ఆనకట్టని నేను బాగు చేస్తాను. నాకు ఏమిస్తారు?" అని అడిగాడు.

"ఒక వంద రూబుళ్లు, రెండు గుర్రాలు, నా బగ్గీ, బగ్గీ తోలే మనిషినీ ఇస్తాను," అన్నాడు ప్రభువు.

"చిత్తం. మూడు బళ్లనీ, నాకు సాయం చెయ్యడానికి ఆరుగురు మనుషుల్నీ ఇప్పించండి."

"నీకు కావలసిన వాటినన్నిటినీ తీసుకువెళ్లు."

తమ్ముడూ, ఆ ఆరుగురు మనుషులూ అడవిలోకి వెళ్లారు. అక్కడ తమ్ముడు ఆ మూడు పెద్ద చెట్లనీ కొట్టించాడు. వాటిని తీసుకువచ్చి ఆనకట్ట పగిలిన చోట వేశాడు. అది కొత్త ఆనకట్టలా తయారైంది. ప్రభువు తను ఇచ్చిన మాట నిలబెట్టుకుని తమ్ముడికి వంద రూబుళ్లు, రెండు గుర్రాలూ, బగ్గీ, బగ్గీ తోలే మనిషినీ ఇచ్చాడు.

"ఇప్పుడు నీటి కరువు పాలబడిన బస్తీకి వెళతాను. ఒకవేళ పిశాచాలు చెప్పిన మాట నిజమే అయితే అక్కడి వాళ్లకి సాయం చెయ్యవచ్చు," అనుకున్నాడు.

బగ్గీ ఎక్కి బస్తీకి వెళ్లాడు. దారిలో ఒక ముసలమ్మ తగిలింది. ఆమె కావిడితో నీళ్లు మోసుకు పోతోంది.

"మామ్మా నువ్వు మోసుకు పోతున్నది నీళ్లేనా?" అని అడిగాడు.

"అవును నాయనా," అందామె.

“కాసిని నీళ్లు ఇస్తావా?”

“అయ్యో, నాయనా! ఒక్క చుక్క నీటికోసం ముప్పై మైళ్లు పోవాల్సి వస్తోంది. ఇంటికి మోసుకెళ్లే లోపలే సగం ఒలికే పోతున్నాయి. నాదా పెద్ద కుటుంబం. నేను తీసుకువెళ్లే ప్రతి నీటి బొట్టూ వాళ్లకి అపురూపమే. లేకపోతే అలాగే ఇద్దును,” అని నసిగింది.

“మరేం బెంగ పడకు. నేను మీ ఊరికే వస్తున్నాను. ఇక మీ జీవితంలో నీటి కరువు అంటే ఏమిటో తెలియకుండా చేస్తాను మీకు,” అన్నాడు.

ఆ ముసలావిడ తమ్ముడికి కాసిని నీళ్లు ఇచ్చి గబగబా ఇంటికి వెళ్లిపోయింది. ఊళ్లో అందరికీ తమ్ముడి వాగ్దానం గురించి చెప్పింది. ఊళ్లో వాళ్లు పూర్ణకుంభంతో ఎదురు వెళ్లి తమ్ముడికి స్వాగతం చెప్పారు.

అతను కొబ్బరి తోటని చూసి దాన్ని తవ్వించాడు. భూగర్భంలోంచి నీరు ఉరుకులు పరుగులమీద పైకి ఎగజిమ్ముకుంటూ వచ్చింది.

ఊరివాళ్లు పరమానంద భరితులైపోయి అతనికి డబ్బూ కానుకలూ గుప్పించేశారు. దాంతో అతను అన్నగారి కంటే ధనికుడై పోయాడు.

“పిశాచాలు అనుకున్న రాజ్యానికి వెళతాను. రాజు కూతురికి నయం చేస్తానేమో,” అనుకున్నాడు.

అతను త్వరలోనే అక్కడికి చేరి రాజ ప్రాసాదానికి వెళ్లాడు.

“రాజకుమారికి నేను నయం చేస్తాను,” అన్నాడు.

“ఎక్కడెక్కడినుంచో వైద్యులు వచ్చి పెదవి విరిచి పోయారు, ఇక నువ్వా! చాలు! చాలు!” అన్నారు రాజుగారి నౌకర్లు.

“ఈ గొడవంతా ఎందుకు? వెళ్లి రాజుగారితో చెప్పండి.”

వాళ్లు వెళ్లి రాజుతో చెప్పారు. రాజుగారు తమ్ముడిని పిలిపించారు.

“మా అమ్మాయికి నయం చేస్తే ఆమెని నీకిచ్చి పెళ్లి చేసి, ఈ దేశంలోకల్లా నిన్ను ధనవంతుడిని చేస్తాను,” అన్నాడు.

తమ్ముడిని రాజకుమారి మందిరంలోకి తీసుకుని వెళ్లారు. ఆమె క్షణాలమీద ఉంది అని తమ్ముడు గ్రహించాడు. తను తొందర పడాలి. అతను దురదగొండి పొదని కోసి ధూపం వేశాడు. రాజకుమారికి కొంచెం స్పష్టత చిక్కింది. మూడు రోజుల్లో ఆమెకి నయం అయింది.

రాజూ, రాజ్యంలో ప్రజలు ఆనందించారు.

“నువ్వు మా అమ్మాయికి నయం చేశావు, ఆమెని నీకిచ్చి పెళ్లి చేస్తాను. నా తరవాత రాజ్యం

నీదే," అని చెప్పాడు రాజు. ఆ తరవాత కొంత కాలానికి రాజుగారు స్వర్గస్థులయ్యారు. తమ్ముడు రాజయ్యాడు. అతను చాలా కాలం రాజ్యపాలన చేశాడు. అప్పుడు ఒక ధనికుడైన వర్తకుడు ఆ రాజ్యానికి వెళ్లాడు. అక్కడ వ్యాపారం చేసుకోవడానికి రాజు అనుమతి కోసం తన మనుషుల్ని పంపాడు. స్వయంగా ఆ వర్తకుడు తనను కలుసుకోవాలని రాజు అయిన తమ్ముడు కబురు చేశాడు. వర్తకుడు వచ్చాడు. అతను తన అన్నే అని తమ్ముడు గుర్తుపట్టాడు. కాని అన్న గుర్తు పట్టినట్టు లేదు. అతని అభ్యర్థనని మన్నించాడు. కాని మరోసారి తనని చూడకుండా అతన్ని ఊరు విడిచి వెళ్లనివ్వవద్దని నౌకర్లతో చెప్పాడు. అతని మనుషులు రాజు చెప్పినట్టే చేశారు. వర్తకుడిని రాజ మందిరానికి తీసుకువచ్చారు.

అతనిది ఏ ఊరో ఏమిటో తమ్ముడు భోగట్టా అడిగాడు. అతను చెప్పాక తను ఫలానా అని వెల్లడించాడు.

"మనిషి న్యాయంగా ఉండి బాగు పడలేడని నువ్వు ఒకసారి అన్నావు. మరి నువ్వు తప్పు అని తేలింది. నువ్వు ఒట్టి వర్తకుడిగానే ఉండిపోయావు. నేను న్యాయంగా ఉండి రాజును అయ్యాను," అన్నాడు.

జరిగిన సంగతి యావత్తూ చెప్పి, రెండు ఓడల నిండా కానుకలూ, సరుకులూ నింపి అన్నకి బహూకరించి పంపాడు.


"నువ్వు చేసిన అన్యాయాలు మరిచిపోతాను, ఈ ఓడల్ని తీసుకో అన్నయ్యా. ఇంటికి వెళ్లాక న్యాయం జయిస్తుందని అందరికీ చెప్పు. మనిషన్నవాడు తన పొట్టకే శ్రీరామరక్ష అనుకోకుండా నలుగురి బాగూ చూడాలని చెప్పు."

అన్న ఓడల్ని తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఇదంతా చూసీ, తమ్ముడి వైభవం చూసీ అతనికి ఈర్ష్య కలిగింది. తమ్ముడు రాజయ్యాడు. తను ఇంకా అలానే ఉండిపోయాడు. అలా ఆలోచించుకుని ఆలోచించుకుని ఒక రోజున ఇలా అనుకున్నాడు:

"నేను వెళ్లి తమ్ముడికిమల్లే ఉరి పోసుకోటానికి ప్రయత్నిస్తాను. ఏమో వాడికి మల్లే చక్రం తిరగొచ్చు."

అతను ఒక తాడు తీసుకుని అడవిలో అదే చోటికి వెళ్లాడు. కాని హఠాత్తుగా ఒకదాని తరవాత ఒకటిగా పిశాచాలు వచ్చి అతని మీద పడి అతన్ని చెట్టు దగ్గరికి ఈడ్చుకుపోయి చిటారు కొమ్మకి కట్టి ఉరి తీశాయి.





# ముసలాయన కూతురూ ముసలామె కూతురూ

అనగా అనగా ఒకప్పుడు ఒక ముసలి దంపతులు ఉండేవాళ్లు. వాళ్లకి ఒక అమ్మాయి ఉండేది. ముసలావిడకు అవసాన ఘడియలు వచ్చినప్పుడు భర్తని పిలిచింది.

"నేను చనిపోయిన తరవాత నువ్వు మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకుంటే ఒక్కటి మాత్రం గుర్తు ఉంచుకో. మనకి దగ్గర్లో కూతురితో ఉంటున్న వితంతువుని మాత్రం చేసుకోవద్దు. ఆమె నీకు మంచి ఇల్లాలుగా ఉండవచ్చునేమోగానీ మన బిడ్డకి మంచి తల్లిగా ఉండదు," అని చెప్పింది.

"అసలు నేను పెళ్లే చేసుకోను," అన్నాడు ముసలాయన.

ఆమె చనిపోయింది. ఆమె అంత్యక్రియలు పూర్తి చేసి ముసలాయన కూతురితో జీవితం వెళ్లదీస్తున్నాడు. అలా కొంత కాలం గడిచింది. ఒక రోజున అతను ఊళ్లో నడుచుకుంటూ వెళుతున్నాడు. దారిలో, తన భార్య వద్దు అని వారించిన వితంతువుని చూద్దామని వాళ్ల ఇంట్లోకి వెళ్లాడు. పెళ్లాం చనిపోయేటప్పుడు మళ్లీ పెళ్లి చేసుకోను అని అనడం మట్టుకు అన్నాడు. కాని ఆ మాట మరిచిపోయాడు. ఆ వితంతువు ఇంటికి ఒకసారి, రెండోసారి, ఇంకోసారి వెళ్లాడు. తరవాత ఆమెని పెళ్లి చేసుకుంటానని అన్నాడు.

ఆ వితంతువు మహదానంద పడిపోయింది. అతను ఆ ముక్క ఎప్పుడంటాడా అని ఎదురు చూస్తున్నట్టు చెప్పింది. ఆమె, ముసలాయనా పెళ్లి చేసుకున్నారు. ఆమె తనకి ఉన్న గొడ్డూ గోదాతో సహా, కూతుర్ని తీసుకుని అతని ఇంటికి వచ్చేసింది.

ఇప్పుడు ఆ నలుగురూ కలిసే ఉన్నారు. ఆ ముసలాయనా, ముసలామె, అతని కూతురూ, ఆమె కూతురూ కలిసే ఉండేవాళ్లు. ముసలాయన కూతురంటే ముసలామెకి అసహ్యం. రోజంతా



ఆమెని తిట్టిపోస్తూ ఉండేది. ఇక ఆ పిల్లలూ ఎప్పుడూ దెబ్బలాడుకుంటూనే ఉండేవాళ్లు. ముసలామె కూతురే ఎప్పుడూ తగువు రేపెట్టేది.

ఊళ్లో పిల్లలతో కలిసి ఆ పిల్లలిద్దరూ పని చేసుకోవడానికి వెళ్లేవాళ్లు. అక్కడ ముసలాయన కూతురు నార వడుకుతూ ఉండేది. ముసలామె కూతురు మాత్రం అక్కడ చేరిన కుర్రకారుతో జల్సాగా గడిపేది. నార వడికేది కాదు, కాల్చేసేది. తెల్లవారుతూనే ఇంటికి బయల్దేరి వెళ్లేవాళ్లు. ఇంటి గుమ్మం దగ్గరికి వెళ్లగానే ఒట్టి చేతులతో ఉన్న ముసలామె కూతురు ముందుగా కంచె దాటేసి ముసలాయన కూతురికేసి తిరిగేది.

"ఇదిగో, అక్కా, నేనీ నారబట్ట పట్టుకుంటాగానీ నువ్వు కంచ దాటు," అని చెప్పేది.

ముసలాయన కూతురు కంచె దాటే లోపల ముసలామె కూతురు ఇంట్లోకి పరిగెత్తిపోయేది. ఆ నారబట్ట చేత్తో పట్టుకుని, ముసలాయన కూతురు రాత్రంతా జల్సాగా గడిపిందనీ, తన నార కాల్చేసుకుందనీ తల్లికి చెప్పేది.

"అమ్మా, చూడు నేను ఇంతసేపూ ఒళ్లు దాచుకోకుండా పని చేసి ఇంటికి పరిగెత్తుకు వచ్చాను. తనూ ఉంది అబ్బ, ఎంత ఒళ్లు వంగని మనిషో," అని తల్లితో చెప్పేది.

ముసలాయన కూతురు ఇంటికి రాగానే ముసలామె ఆమెని కొట్టేది.

"ఇంత ఒళ్లు వంగని పిల్లని ఎన్నడూ చూసి ఎరగను. ఇక్కడ గిన్నె అక్కడ పెట్టదు. అంతా నీ పెంపకమే. నువ్వేం మాట్లాడవాయె," అని ముసలాయనతో చెప్పేది.

సవతి తల్లి ఏమన్నా, ఎంత ఉడికించినా, ముసలాయన కూతురు పల్లెత్తు మాట అనేది కాదు. నోరు మెదపని కూతురుని చూసి ముసలాయన జాలిపడి ప్రేమగా ఉండడం సవతి తల్లికి, ఆమె కూతురికి మరీ కారం రాసినట్టుండేది. దాంతో ఏం చెయ్యాలా అని తల్లీ కూతురూ ఆలోచించారు. ఆమెను ఇంట్లోనుంచి వెళ్లగొట్టి వదిలించుకోవాలని చూశారు.

సవతి తల్లి భర్తని తిట్టి రాద్ధాంతం చేసేది. ఎప్పుడూ ఒకే పాట పాడేది.

"ఇదుగో నీ కూతురుందే, గుడ్డిగవ్వకి పనికి రాదు. ఇక్కడ చీపురు అక్కడ పెట్టదు. జల్సాగా గడిపేస్తుంది, లేకపోతే ముసుగు తన్ని పడుకుంటుంది. అలా దాన్ని గారం చేయక ఎవరి దగ్గరైనా పనికి కుదర్చవచ్చుగా. అప్పుడైనా కాస్త పనికొస్తుందేమో," అని నసపెట్టేది.

"ఎక్కడికి తీసుకెళ్లను? ఎవరు దీన్ని పనిలో పెట్టుకుంటారు?" అని ముసలాయన అడిగాడు.

"ఎక్కడికైనా తీసికెళ్లు. ఇక అది మాత్రం నా కంట పడకూడదు," అంది.

ఈ సొద, సణుగుడు పడలేక ముసలాయనకి తలనొప్పి వచ్చేసింది.

ఇక చేసేది లేక ఆవిడ చెప్పినట్టే చెయ్యాలని ముసలాయన అనుకున్నాడు. తనకి ఎంత బాధ కలిగినా కూతురుని తీసికెళ్లక తప్పదు.

తండ్రీ కూతురూ ఇల్లు వదిలి బయల్దేరారు. ఓ పెద్ద కీకారణ్యంలోకి వచ్చారు.

“నువ్వు వెళ్లిపో నాన్నా. నేను వెళతాలే. ఇక్కడ పనిమనుషులు కావలసిన వాళ్లు ఎవరన్నా దొరుకుతారులే,” అని కూతురు చెప్పింది.

“సరేనమ్మా,” అన్నాడు ముసలాయన.

తండ్రీ కూతురూ ఒకరి దగ్గర ఒకరు సెలవు తీసుకున్నారు. తండ్రి వెనక్కి వెళ్లిపోయాడు. ఆ అమ్మాయి ఒక్కటే నడుచుకుంటూ అడవిలోకి వెళ్లింది.

అలా నడుచుకుంటూ వెళుతుండగా అడవిలో నిశ్శబ్దం ఆవరించుకుంది. ఆఖరికి ఆమె ఒక ఆపిల్ చెట్టు దగ్గరికి వచ్చింది. దాని చుట్టూ కలుపు నిలువెత్తు పెరిగిపోయి ఆపిల్ చెట్టుని కమ్మేసింది. ఆపిల్ చెట్టు కొంచెమే కనిపిస్తోంది.

“అమ్మా, ఈ కలుపు మొక్కలన్నిటినీ పీకేసి నన్ను కొంచెం బాగా కనిపించేట్టు చెయ్యమ్మా. ఏదో ఒక రోజున నీకు ఉపకారం చేస్తాలే,” అంది ఆపిల్ చెట్టు.

ముసలాయన కూతురు నడుం బిగించి పనిలోకి దిగింది. కలుపు మొక్కలు పీకేసి, చెట్టుని చక్కగా కత్తిరించింది. చెట్టు చుట్టూతా ఇసక చల్లింది. చెట్టు ఆమెకి కృతజ్ఞత చెప్పింది. తరవాత ఆమె తన దారిన వెళ్లిపోయింది.

ఇంతలో ఆమెకి దాహం వేసింది. కాసిని నీళ్లు తాగుదామని ఒక నీటిబుగ్గ దగ్గరకి వెళ్లింది.

“చూడమ్మా, నన్ను శుభ్రం చేసి, తుడిచి, నేను బాగా కనిపించేట్టు చెయ్యి. నీ ఉపకారం మరవనులే,” అంది నీటిబుగ్గ.

ఆ అమ్మాయి నీటిబుగ్గని శుభ్రం చేసి, తుడిచింది. నీటిబుగ్గ పళ్లెం చుట్టూతా ఇసక చల్లింది. నీటిబుగ్గ ఆమెకి కృతజ్ఞత చెప్పింది. ఆ తరవాత ఆమె తన దారిన వెళ్లిపోయింది.

అలా వెళుతూండగా ఆమెకి ఒక కుక్క ఎదురైంది. అది చాలా మురికిగా ఉంది. దాని బొచ్చునిండా పల్లేరు కాయలు గుచ్చుకుని ఉన్నాయి.

“పాపా, నన్ను కడిగి బాగా కనిపించేట్టు చెయ్యవూ. నువ్వు చేసిన ఉపకారానికి బదులు తీర్చుకుంటాలే,” అంది కుక్క.

ఆ అమ్మాయి కుక్కని కడిగి శుభ్రం చేసింది. దాని బొచ్చుకి అంటుకున్న పల్లేరు కాయల్ని ఏరి పారేసింది. కుక్క ఆమెకి కృతజ్ఞతలు చెప్పింది. తరవాత ఆమె తన దారిన వెళ్లిపోయింది.

అలా వెళుతూంటే ఆమెకి ఒక పొయ్యి కనిపించింది. అది పెళ్లలు ఊడిపోయి, పెచ్చులు లేచిపోయి ఉంది.

"చూడమ్మా, నన్ను తుడిచి శుభ్రం చేసి పైన కొత్తమట్టి పూత పెట్టవూ? ఏదో రోజున నీ ఉపకారానికి బదులు తీర్చుకుంటాలే," అంది పొయ్యి.

ఆ అమ్మాయి పొయ్యిని లోపలా, బయటా తుడిచి శుభ్రం చేసింది. కొత్త మట్టితో పైన పూత పెట్టింది. ఆ పొయ్యి ఆమెకి కృతజ్ఞతలు చెప్పింది. తరవాత ఆమె తన దారిన వెళ్లిపోయింది.

అలా వెళుతూ ఉంటే ఆమెకి ఒక ఆడమనిషి ఎదురైంది.

"అమ్మాయ్! నిన్నే," అని ఆవిడ పిలిచింది.

"ఏమమ్మా?" అంది ఆ అమ్మాయి.

"ఎందాకా ప్రయాణం?"

"ఎక్కడైనా పని దొరుకుతుందేమోనని వెళుతున్నా, అత్తా."

"నా దగ్గర పని చేస్తావా?"

"అంతకంటేనా!"

"నేను చెప్పినట్టు చేస్తే నీకు పని కష్టంగా కనిపించదు."

"ఏం చెయ్యాలో చెప్పి, ఎలా చెయ్యాలో ఒకసారి చూపిస్తే ఇక తరవాత నా అంతట నేనే చేస్తాను."

వాళ్లు ఆ ఆడమనిషి ఇంటికి వెళ్లారు.

"చూడమ్మా, ఏం చెయ్యాలో నీకు చెపుతాను. ఇవిగో ఇక్కడ కొన్ని కుండలున్నాయి. రోజూ పొద్దునా సాయంత్రం నువ్వు వాటిలో కొద్దిగా నీళ్లు కాయాలి. ఆ నీళ్లని కుడితి తొట్టిలో పొయ్యాలి. దాంట్లో కొంచెం పిండి వేసి కలపాలి. నీకు ఏమి కనిపించినా, వినిపించినా భయపడొద్దు. కుడితి మరీ వేడిగా ఉండకుండా చూడు అంతే. అప్పుడు వెళ్లి గుమ్మం దగ్గర నుంచుని మూడుసార్లు ఈలవెయ్యి. పాములు, బల్లులు, బోదురు కప్పలు ఇంకా అలాంటి ప్రాణులు పాకుతూ వస్తాయి. వాటికి ఈ మేత పెట్టు, తరవాత అవి వెళ్లిపోతాయి."

"అలాగేనమ్మా, నువ్వు చెప్పినట్టే చేస్తాను," అంది ఆ అమ్మాయి.

సాయంత్రం అయింది. ఆమె పొయ్యి రాజేసి నీళ్లు కాచింది. ఆ వేడి నీళ్లని కుడితి తొట్టిలో

పోసింది. అప్పుడు అందులో కొంత పిండి వేసి కలిపింది. గుమ్మం దగ్గరికి వెళ్లి నుంచుని మూడు సార్లు ఈల వేసింది. పాములు, బల్లులు, బోదురు కప్పలు ఇంకా అలాంటి ప్రాణులు పాకుతూ అన్ని వైపులనుంచీ వచ్చాయి. అవి కడుపునిండా తిని మళ్లీ పాక్కుంటూ వెళ్లిపోయాయి.

ఆ మాదిరిగా ఒక ఏడాది జరిగింది. యజమానురాలు చెప్పినట్టే ఆ అమ్మాయి చేసింది. ఏడాది అయిపోగానే ఆవిడ ఆ అమ్మాయిని పిలిచింది.

"నువ్వు నా దగ్గర పని చెయ్యడం మొదలుపెట్టి ఇవాల్టికి ఏడాది అవుతోంది. మరో ఏడు ఉంటావో, పని చాలించుకుని వెళ్లిపోతావో నీ ఇష్టం. కాని నువ్వు మాత్రం నాకు చాలా ఆసరా ఉన్నావు. నాకు చాలా సంతోషం కలిగింది," అంది ఆవిడ.

తనకి ఉండడానికి ఇంత వసతి, తినడానికి తిండి ఇచ్చినందుకు, తన పట్ల దయగా ఉన్నందుకు ఆ అమ్మాయి ఆవిడకి కృతజ్ఞతలు చెప్పింది. కాని తనకి ఇంటికి తిరిగి వెళ్లే వేళ అయిందని చెప్పింది.

"సరే అయితే. కాని వెళ్లే ముందు నీకు ఇష్టమైన గుర్రాన్నీ, బండినీ తీసుకెళ్లు," అంది.

ఆవిడ ఒక పెద్ద పెట్టెలో రకరకాల వస్తువులు నిండుగా పెట్టి ఆమెకి ఇచ్చింది. అడవి శివారు దాకా వెళ్లి ఆమెని సాగనంపింది. ఒకరి దగ్గర ఒకరు సెలవు తీసుకున్నారు. ఆవిడ వెనక్కి వెళ్లిపోయింది, ఆ అమ్మాయి ఒక్కతే బండి తోలుకుని ముందుకు వెళ్లసాగింది.

అలా వెళ్లిపోతూ ఉంటే ఆమె ఇదివరలో సాయం చేసిన పొయ్యి ఆమెకి కనిపించింది. దానిమీద చక్కగా అప్పుడే వేయించిన శనక్కాయలున్నాయి.

"కొంచెం దగ్గరగా బండి తోలుకు రా, అమ్మా. నువ్వు ఇదివరకు నాకు సాయం చేశావు. నీకు కాసిని వేయించిన శనక్కాయలు ఇస్తాను," అంది పొయ్యి.

ఆమె పొయ్యి దగ్గరికి బండి తోలుకుని వెళ్లింది. శనక్కాయలు ఆమె బండిలోకి ఎగిరాయి. ఆమె పొయ్యి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయింది.

ఇంతలో ఆమెకి ఒక కుక్క పరిగెత్తుకుంటూ తనవైపే రావడం కనిపించింది. ఆ కుక్కకి ఇదివరలో ఆమె సాయం చేసింది. అది పళ్లతో ఒక హారం పట్టుకు వస్తోంది. అది బండిదాకా వచ్చి ఆగింది.

"ఇదిగో అమ్మాయ్, ఈ హారం తీసుకో. నాకు సాయం చేసినందుకు ఇది నా కానుక," అంది.

ఆ అమ్మాయి కుక్కకి కృతజ్ఞతలు చెప్పి చాలా సంతోషంగా బండి తోలుకుంటూ వెళ్లిపోయింది.

వెళుతూ ఉంటే ఆమెకి దాహం వేసింది.

"నేను సాయం చేసిన నీటిబుగ్గ దగ్గరికి వెళ్లి కాసిని నీళ్లు తాగుతాను," అనుకుంది.

ఆమె నీటిబుగ్గ దగ్గరికి వెళ్లింది. చక్కని, శుభ్రమైన కొబ్బరిబొండాం నీళ్లలాంటి నీళ్లు నీటిబుగ్గలో నిండుగా ఉన్నాయి. నీటిబుగ్గకి పక్కనే ఒక బంగారు పీపా, ఒక బంగారు పాత్ర ఉన్నాయి.

"అమ్మాయ్, కాసిని నీళ్లు తాగి ఈ పీపానీ, పాత్రనీ తీసికెళ్లిపో," అంది నీటిబుగ్గ.

ఆమె తాగడానికి ఒంగింది. కాని ఆమె నీళ్లు అనుకొన్నది ద్రాక్షరసం, ఇదివరకు ఎన్నడూ చవిచూడని మంచిరకం ద్రాక్షరసం! బంగారు పీపా నిండా నింపుకుని, ఆ పీపానీ, పాత్రనీ బండిలో పెట్టుకుని నీటిబుగ్గకి కృతజ్ఞతలు చెప్పి వెళ్లిపోయింది.

ఆ అమ్మాయి వెళుతూ ఉండగా ఆపిల్ చెట్టు కనిపించింది. ఆపిల్ చెట్టు గుబురుగా ఉంది. ఆపిల్ పళ్లతో కొమ్మలు ఒంగిపోయాయి.

"అమ్మాయ్, కాసిని ఆపిల్ పళ్లు కోసుకో, నాకు సాయం చేసినందుకు నీకు నా కానుక," అని ఆపిల్ చెట్టు చెప్పింది.

ఆ అమ్మాయి బండిని చెట్టు దగ్గరికి తోలుకుని వెళ్లింది. ఆపిల్ పళ్లు వాటంతట అవే బండిలోకి రాలాయి.

ఆ అమ్మాయి ఇంటికి వెళ్లిపోయింది.

"నాన్నా చూడు ఏం తెచ్చానో?" అని తండ్రిని పిలిచింది.

ముసలాయన గుమ్మం ఇవతలికి వచ్చి చూశాడు. ఎదురుగుండా కన్నకూతురు ఉంది! అతను మహదానంద పడిపోయి పరిగెత్తుకుంటూ ఎదురు వెళ్లాడు.

"ఇన్నాళ్లూ ఎక్కడున్నావమ్మా! ఏం చేస్తున్నావు?" అని అడిగాడు.

"పని చేస్తూ ఉన్నా, నాన్నా. ఈ వస్తువుల్ని ఇంట్లోకి తీసికెళదాం," అంది ఆమె.

అబ్బో, ఎన్ని వస్తువులు ఉన్నాయో! బండి నిండా బండెడు వస్తువులు ఉన్నాయి. తండ్రీ కూతురూ వాటిని ఇంట్లోకి తీసికెళ్లారు. అవి ఒక దానితో ఇంకోటి పంతం వేసుకుని అందంగా కనిపిస్తున్నట్టు ఉన్నాయి. అన్నిటి కంటే అందంగా, శోభాయమానంగా ఉంది ఆమె మెడలో ఉన్న హారం.

మూసలాయన కూతురు ఎంతమంచి వస్తువులు తెచ్చిందో చూసి ముసలామెకి కళ్లు కుట్టాయి. మళ్లీ ముసలతన్ని వేధించడం మొదలుపెట్టింది. ముసలాయన తన కూతురుని వదిలిన చోటికే తీసికెళ్లి తన కూతురుని కూడా దిగబెట్టమని సతాయించింది. ముసలామెకి చాలా అసూయగా ఉంది. ఒక్క పూట కూడా ముసలాయన్ని విశ్రాంతిగా ఉండనివ్వలేదు.

ఆఖరికి "అబ్బబ్బ, అలాగే. కూతురుని ముస్తాబవమను. తీసికెళ్లి అక్కడ దిగబెడతాను," అన్నాడు ముసలాయన.

ఆ అమ్మాయి తయారవగానే ఇద్దరూ బయలుదేరారు.

అడవిలోకి వెళ్లారు.

"నేను వెనక్కి వెళతాను, ముందుకి నువ్వొక్కదానివే వెళ్లు," అన్నాడు.

ఇద్దరూ ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. ముసలాయన ఇంటి దారి పట్టాడు. ముసలామె కూతురు అడవి లోపలికంటా వెళ్లింది.

ఆమె అలా వెళుతూ ఉంటే చుట్టూతా కలుపు బాగా పెరిగిపోయిన ఆపిల్ చెట్టు కనిపించింది.

"చూడమ్మా! ఈ కలుపు పీకేసి నన్ను బాగా కనిపించేట్టు చెయ్యవూ! ఏదో ఒక రోజున నీకు ఉపకారం చేస్తాలే," అంది చెట్టు.

"నిన్ను తగలేసినట్టే ఉంది! నా చేతులు మురికి చేసుకోనా!" అంది ఆ అమ్మాయి.

ఆమె అలా ముందుకు వెళ్లింది. కాసేపయేటప్పటికి ఒక నీటిబుగ్గ దగ్గరికి చేరింది. ఆ నీటిబుగ్గ బాగా పాడు పడిపోయింది.

"అమ్మాయ్! నన్ను శుభ్రం చేసి మళ్లీ బాగా కనిపించేటట్టు చెయ్యవూ. నీ రుణం ఉంచుకోనులే," అంది నీటిబుగ్గ.

"నీ చావు నువ్వు చావు! నాకేం సంబంధం లేదు," అని ఆ అమ్మాయి వెళ్లిపోయింది.

ఆమె అలా వెళ్లగా వెళ్లగా ఒక పొయ్యి కనిపించింది. ఆ పొయ్యికి పెళ్లలు ఊడిపోయాయి. పెచ్చులు లేచిపోతున్నాయి.

"అమ్మాయ్, నాకు కొత్త మట్టి పూత పెట్టవూ. నీకు ఏదో ఒక రోజున ఉపకారం చేస్తాలే," అంది పొయ్యి.

"నిన్ను తగలెయ్య! నేనెందుకు చెయ్యాలి ఆ పని?" అంది ఆ అమ్మాయి కోపంగా.

అక్కడినుంచి అలా ముందుకు వెళ్లగా ఆమెకి మురికిగా ఉన్న కుక్క కనిపించింది. దాని బొచ్చునిండా పల్లేరు కాయలు గుచ్చుకుని ఉన్నాయి.

"బాబ్బాబు! నీకు పుణ్యం ఉంటుంది! ఈ పల్లేరు కాయలు తీసేసి నన్ను కడిగి శుభ్రం చెయ్యవూ. ఒక రోజున నీకు ఉపకారం చేస్తాలే," అంది కుక్క.

కాని ఆ అమ్మాయి! కుక్కకేసి ఒక సారి చూసింది.

"నిన్ను తగలెయ్య! కుక్కా! నా చేతులు మురికి చేసుకోనా! నువ్వు అరిచి గీపెట్టి మొత్తుకున్నా నిన్ను తాకనుగాక తాకను," అంది.

అలా అని ముందుకు వెళ్లిపోయింది.

అంతట్లోకీ ఆమెకి ముసలాయన కూతురు ఎవరితో ఉందో ఆ ఆడమనిషి కనిపించింది.

“ఏం అమ్మాయ్,” అని ఆవిడ పలకరించింది.

“దండం, అత్తా!” అంది ఆ అమ్మాయ్.

“ఎందాకా ప్రయాణం?”

“పని కోసం వెతుకుతున్నాను.”

“నా దగ్గర పని చేస్తావా?”

“అభ్యంతరం లేదు. కాని నేను ఏం చెయ్యాలి?”

“నేను చెప్పినట్టే చేస్తే ఏమంత కష్టమైన పని కాదు.”

“ఎలా చెయ్యాలో చూపించు వెంటనే. తరవాత నా అంతట నేనే చేస్తాననుకుంటున్నాను,” అంది ఆ అమ్మాయి.

“సరే అయితే విను. నీకు కొన్ని కుండలు ఇస్తాను. రోజూ పొద్దునా సాయంత్రం వాటిలో నీళ్లు కాచి, అవి మరీ మసిలిపోకుండానే, కుడితి తొట్లో పొయ్యి. తరవాత అందులో కొంచెం పిండి కలుపు. అప్పుడు వెళ్లి గుమ్మం దగ్గర నుంచుని మూడు సార్లు ఈల వెయ్యి. నానా రకాల పాములూ, బల్లులూ, బోదురు కప్పలూ, ఇంకా అలాంటి ప్రాణులు పాక్కుంటూ వస్తాయి. భయపడొద్దు. వాటిని కడుపునిండా తిననియ్యి. తరవాత అవి మళ్లీ పాక్కుంటూ వెళ్లిపోతాయి. ఏం, చెయ్యగలవా ఇప్పుడు?”

“ఆ, చేస్తా,” అందా అమ్మాయి.

సాయంత్రం అయింది. ఆమె పొయ్యి రాజేసి కుండలతో నీళ్లు పెట్టింది. నీళ్లు మసిలి పోయేదాకా అలానే ఉంచేసింది. కుండలు బాగా పెద్దవి కావడంతో కళపెళ కళపెళ మంటూ చప్పుడు చేశాయి. అప్పుడా నీళ్లని తొట్టెలో పోసి సుమారుగా పిండి కలిపింది. జావలాగా కాకుండా అది గట్టి పడిపోయింది. తరవాత వెళ్లి గుమ్మం దగ్గర నుంచుని మూడు సార్లు ఈల వేసింది. పాములు, బల్లులు, బోదురు కప్పలు అన్ని వైపులనుంచీ వచ్చాయి. అవి బాగా తినొచ్చని తొట్టెమీదకి ఎక్కాయి. ఆ వేడికి ఉడికి చచ్చిపోయాయి.

అవి తిన్నాయని ఆమె అనుకుంది. అప్పుడు అవి మెలి తిరిగి, కదిలి చివరికి మెదలకుండా పడిపోవడం చూసి యజమానురాలిని పిలుచుకుని రావడానికి వెళ్లింది.

“నీ దగ్గరున్న ఆ జీవులు వింతగా ఉన్నాయేం? తిన్నాక అవి మళ్లీ లేవకుండా పడి పోయాయేం?” అని అడిగింది.

“ఏమంటున్నావ్ నువ్వు?” అని ఆవిడ భయపడి అడిగింది. గబగబా పెరట్లోకి పరిగెత్తింది. జరిగింది చూసి తల చేత్తో పట్టుకుని కూలబడి పోయింది.

“ఓరి నాయనోయ్! ఎంత పని చేశావ్! ప్రాణంతో వాటిని ఉడికించేశావ్!” అని లబోదిబోమంది.

ఆవిడ ముసలామె కూతురుని శాపనార్థాలు పెట్టింది, మొత్తుకుని ఏడ్చింది. ఎంత మొత్తుకున్నా చచ్చినవి బతికి వస్తాయా? అందుకు చేసేదేమీ లేక వాటన్నిటినీ ఒక పెట్టెలో పెట్టింది. ఆ అమ్మాయి కొలువు ఏడాది పూర్తవగానే ఆమెకి ఒక కుంటి గుర్రాన్నీ, విరిగి పోయిన బండినీ ఇచ్చి ఈ పెట్టెని అందులో పెట్టి, పైన పాత గుడ్డలమూటపెట్టి సాగనంపింది.

ముసలాయన కూతురికి ఇచ్చినవే యజమానురాలు తనకీ ఇచ్చి ఉంటుందని ఆ అమ్మాయి అనుకుంటూ మురిసిపోతూ బండిలో బయలుదేరింది.

ఇంతలో ధగధగ మెరిసిపోయే వజ్రాల హారం మెడలో వేసుకుని ఒక కుక్క వచ్చింది. ఆ హారం తనకే అనుకొని ఆ అమ్మాయి బండి దిగి కుక్కకేసి పరిగెత్తి వెళ్లింది.

“అమ్మ! ఆశ! అమ్మాయ్, నువ్వు నాకు సాయం చెయ్యనన్నావ్ నీకీ హారం ఇవ్వను,” అంది.

అక్కడి నుంచి ఆ అమ్మాయి అంతకు ముందు దాటి వెళ్లిన పొయ్యి దగ్గరకి వచ్చింది. వేయించిన శనక్కాయలు నిండుగా ఉన్నాయి.

“శనక్కాయల్ని తీసుకువెళ్లి మా అమ్మకి ఇస్తా,” అనుకొంది ఆమె.

బండి దిగింది. శనక్కాయలు తీసుకునే లోపలే పొయ్యి వారించింది.

“వీల్లేదు, వీల్లేదు. నువ్వు నాకు సాయం చెయ్యడానికి ఇష్టపడలేదు. అందుకే నీకు శనక్కాయలు ఇవ్వను,” అంది పొయ్యి.

దాంతో ఆ అమ్మాయి మళ్లీ తన దారిన బయలుదేరి వెళ్లింది. ఆమెకి బాగా దాహం అయింది. నీటిబుగ్గని చూసి దగ్గరికి వెళ్లింది. నీటిబుగ్గ నిండుగా ఉండి నీళ్లు పొర్లి పోతున్నాయి. గబగబా నీటిబుగ్గ దగ్గరికి వెళ్లి తాగుదామని వంగింది. కాని నీటిబుగ్గ వారించింది.

“వీల్లేదమ్మాయ్. నన్ను శుభ్రం చెయ్యడానికి నీకు వీలు కాలేదు. అందుకని నీకు నీళ్లులేవు,” అంది.

ముసలామె కూతురు కళ్లల్లో నీళ్లు తిరిగాయి, ఆమె భోరుమంది. అక్కడి నుంచి బయలుదేరి ముందుకు సాగింది.

వెళుతూ వెళుతూ ఆపిల్ చెట్టు దగ్గరికి చేరింది. ఆపిల్ చెట్టు కొమ్మలనిండా వెండి ఆపిల్‌పళ్లు, బంగారు ఆపిల్‌పళ్లు గుత్తులు గుత్తులుగా ఉన్నాయి. కొమ్మలనిండా ఆ పళ్లు ఎంత గుబురుగా

ఉన్నాయంటే రామ చిలకలు ఆ పళ్లని కొరికేందుకు కూడా సందు లేదు.

"కొన్ని ఆపిల్ పళ్లని తీసుకుని మా అమ్మకి ఇస్తాను," అనుకొంది ఆమె.

కాని ఆపిల్ చెట్టు దగ్గరికి ఆమె ఇంకా వెళ్లకుండానే ఆ చెట్టు ఆమెకి అందకుండా తన కొమ్మల్ని ఊపేసింది.

"వీల్లేదు, వీల్లేదు. నువ్వు నాకు సాయం చెయ్యలేదు. అందుకే నా ఆపిల్ పండు ఒక్కటి కూడా నీకు దక్కదు," అంది చెట్టు.

ముసలామె కూతురు భోరున ఏడుస్తూ ఇంటికి వెళ్లిపోయింది.

ఆమె పెరట్లోకి బండిని తీసుకుని వెళ్లి ముసలాయన్ని పిలిచింది.

"రా, నాన్నా, చూడు ఏం తెచ్చానో," అంది.

ముసలాయనా, ముసలామె ఇంట్లోనుంచి ఇవతలికి పరిగెత్తుకుంటూ వచ్చారు. ముసలామె కూతురు ఎదురుగుండా నుంచుంది. వాళ్లకి చాలా సంతోషం కలిగింది. ఆమె తెచ్చిన పెట్టెని అందుకుని, ఆమెని ఇంట్లోకి తీసికెళ్లారు.

పెట్టె తెరిచి చూస్తే ఏముంది! దాన్నిండా చచ్చిపోయిన పాములూ, బోదురు కప్పలూనూ! వాళ్లకి భయం వేసింది.

"ఏమిటిది?" అని అరిచారు.

జరిగిన విషయమంతా ఆమె వాళ్లకి చెప్పింది.

"జీవితంలో మంచివన్నీ నీకు అందకుండా పోతాయి, నీ రాత అంతేనమ్మా. నువ్వు ఇంటి దగ్గరే ఉండిపో, ఎక్కడికీ వెళ్లొద్దు. ముసలాయన కూతురు అడవికి వెళ్లి ఐశ్వర్యాన్ని తెచ్చింది. నీకు ఏమీ లేవు చచ్చిన పాములు తప్ప. ఇంకా నయం నువ్వు తిరిగి వచ్చావ్! అదే పదివేలు," అంది ముసలామె.



# ఓహ్

చాలా చాలా కాలం కింద మన తండ్రులూ, తాతలూ కూడా పుట్టని రోజుల్లో, ఒక బీదవాడూ, అతని భార్యా ఉండేవాళ్లు. వాళ్లకి ఒక కొడుకు ఉండేవాడు. వాడిని చూసి గొప్ప చెప్పుకోవడానికేమీ లేకపోయింది. వాడంత తుంటరి మరొకడు లేడు. వాడు ఒంటినిండా బట్టలు కూడా వేసుకోకుండా పొయ్యి తీనెమీద చేరి రాత్రీ, పగలూ జొన్న గింజలతో ఆడుకుంటూ కాలక్షేపం చేసేవాడు. తల్లిదండ్రులకి ఆవగింజంత సాయం చేసేవాడు కాదు, తన పనీ చేసుకునేవాడు కాదు. వాడికి దగ్గర దగ్గర ఇరవై ఏళ్లు. పొయ్యి తీనెమీద కూర్చుని కిందకి దిగేవాడే కాదు. తిండి తెచ్చి ముందు పెడితే తినేవాడు. లేకపోతే తెచ్చుకునే బదులు తినకుండానే గడిపేసేవాడు. దాంతో వాళ్లమ్మకీ, నాన్నకీ చాలా విచారంగా ఉండేది.

"ఏం చెయ్యాలిరా, ఖర్మ! సాటి పిల్లలు చూడు, తల్లిదండ్రులకి సాయం చేస్తున్నారు," అని వాళ్లు అనేవాళ్లు.

వాళ్ల అమ్మా, నాన్నా చాలా విచారించారు. ఒక రోజున వాళ్లమ్మ అంది:

"ఏమాలోచించావు ఇంటాయనా! మన అబ్బాయి పెద్ద వాడయ్యాడు. కాని వాడికి ఏ పనీ చేత కాదు. వాడిని పనిలోకో, లేకపోతే ఏదైనా వృత్తి నేర్చుకోవడానికో పంపించవచ్చు కదా. కనీసం ఏదో ఒకటి నేర్చుకుంటాడు."

తండ్రి అందుకు 'ఊఁ' అన్నాడు. తన కొడుక్కి పని నేర్పమని ఒక దర్జీ దగ్గరికి పంపాడు. కాని ఆ కుర్రాడు దర్జీ దగ్గర మూడురోజులే ఉన్నాడు. దర్జీ దగ్గరనుంచి పారిపోయి వచ్చేసి మళ్లీ పొయ్యి తీనెమీదకి ఎక్కి జొన్న గింజలతో ఆడుకోవడం మొదలుపెట్టాడు.

తండ్రి వాడిని బెదిరించి చర్మకారుడి దగ్గర పెట్టాడు. కాని వాడు అక్కడినుంచీ కూడా పారిపోయి వచ్చేశాడు. తండ్రి వాడిని తిట్టి, కొట్టి కమ్మరి దగ్గర చేర్చాడు. అయినా లాభం లేకపోయింది. మళ్లీ వాడు అలానే చేశాడు.

తండ్రికి ముందు కంటే ఎక్కువ బాధ కలిగింది.

"నేనేం చెయ్యాలి? ఇంకో రాజ్యానికి తీసికెళ్లి వాడిని ఏదైనా వృత్తి నేర్పేవాళ్ల దగ్గర పెట్టాలి. అలా అయితే అంత తేలికగా పారిపోలేడు," అన్నాడు.

కొడుకుని తీసుకుని మరో రాజ్యానికి బయలుదేరాడు.

వాళ్లు అలా వెళుతూనే ఉన్నారు. ఎన్ని రోజులు గడిచాయో ఎవరికీ తెలీదు. ఆఖరికి వాళ్లు ఒక అడవి చేరుకున్నారు. అది చీమలు దూరని చిట్టడివి, కాకులు దూరని కారడవి. పైన ఆకాశంతప్ప ఏమీ కనిపించదక్కడ. కింద నేల తప్ప ఏం కనిపించదు. అలిసిపోయి వాళ్లు కూచోడానికి ఏమన్నా దొరుకుతుందా అని వెతికారు. బాట పక్క కాలిన చెట్టు మొద్దు కనిపించింది.

"నేను ఆ  చెట్టుమీద కాసేపు కూర్చొని కొంచెం సేపు ఒరుగుతాను," అన్నాడు తండ్రి.

"ఓహ్! అబ్బ! ఏం అలిసిపోయాను," అంటూ అతను చెట్టు మొద్దుమీద కూలబడ్డాడు.

అతనా మాటలు అన్నాడో లేదో చిత్రం! చిన్నగా ఉన్న ఒక ముసలతను ఆ మొద్దులోనుంచి ఇవతలికి వచ్చాడు. ఆ ముసలతనికి మెరిసిపోయే ఆకుపచ్చ గడ్డం ఉంది. ఆ గడ్డం అతని మోకాలు తాకేటంత బారుగా ఉంది.

"ఏం కావాలి నాయనా నీకు?" అని అడిగాడు.

తండ్రి ఆశ్చర్యంతో అడుగు వెనక్కి వేశాడు. అంత వింత మనిషి ఎక్కడినుంచి వచ్చినట్టు!

"నీ దగ్గర నుంచి నాకు ఏమీ అక్కర్లేదు," అన్నాడు.

"అయితే మరి నన్ను ఎందుకు పిలిచావ్?" అని ఆ ముసలతను అడిగాడు.

"ఎవరు నువ్వు?"

"నేను ఓహ్‌ని, వనానికి చక్రవర్తిని. నన్నెందుకు పిలిచావు?"

"ఏం చిత్రం! నిన్ను గురించి నేనసలు అనుకోనే లేదు కదా!"

"నువ్విప్పుడే కదా 'ఓహ్' అన్నావు, నేను విన్నాను."

"అవును, కాని నేను అలిసిపోయాను."

"ఎందాకా ప్రయాణం?" అని ఓహ్ అడిగాడు.

"దారి ఎక్కడికి తీసికెళితే అక్కడికి. ఈ తుంటరి పిల్లాడికి ఏదన్నా వృత్తి నేర్పేవాళ్లు దొరుకుతారా



అని వెళుతున్నాను. వీడికి కొంచెం బుద్ధి చెప్పేవాళ్లుంటే బాగుండును. నేను చెయ్యలేని దాన్ని బహుశా పరాయి వాళ్లు చెయ్యగలరు. ఊళ్లో ఎక్కడ పెట్టినా పారిపోయి వచ్చేశాడు," అన్నాడు తండ్రి.

"వాడిని నా దగ్గర వదిలెయ్యరాదా! నేను వాడిని మనిషిగా తయారు చేస్తాను. కాని ఒక షరతు: ఒక ఏడాదయ్యాక వాడిని తీసికెళ్లడానికి నువ్వు వచ్చినప్పుడు వాడు నీ కొడుకని గుర్తిస్తేనే వాడిని తీసికెళతావు. లేకపోతే వాడిని నాతో ఇంకో ఏడాది ఉంచాలి."

"చాలా బాగుంది, అలాగే చేద్దాం," అన్నాడు తండ్రి.

వ్యవహారం ఫైసలు చేసుకున్నారు. కొడుకుని తండ్రి ఓహ్ దగ్గర విడిచిపెట్టి ఇంటికి వెళ్లిపోయాడు.

ఓహ్ ఆ కుర్రాడిని తిన్నగా ఎంతో లోతు ఉన్న అధోలోకంలోకి తీసుకువెళ్లాడు. రెల్లుగడ్డితో కప్పు వేసిన ఆకుపచ్చ కుటీరానికి తీసుకువెళ్లాడు. ఆ ఇంట్లో ఉన్న ప్రతీదీ ఆకుపచ్చగానే ఉంది. గోడలు, బల్లలు, ఆ మాటకొస్తే ఓహ్ భార్య, పిల్లలు కూడా ఆకుపచ్చ రంగే. ఓహ్ పనిపిల్లలైతే అందరూ వనదేవతలే. అంతా పచ్చటి గరికలాగా ఆకుపచ్చగా ఉన్నారు.

"కూర్చో. ఏదన్నా తిను," అని ఓహ్ వాడితో అన్నాడు.

పనిపిల్లలు కొంచెం భోజనం తెచ్చి పెట్టారు. మిగతా అన్నిటిలాగానే అదీ ఆకుపచ్చగా ఉంది. వాడు కొంచెం తిన్నాడు.

"ఇప్పుడు వెళ్లి కొంచెం కట్టెలు కొట్టి పట్టుకురా," అని ఓహ్ వాడికి చెప్పాడు.

ఆ కుర్రాడు వెళ్లాడు. కట్టెలు కొట్టాడో లేదో ఎవరికీ తెలియదు. కాని దుంగల మీదకి ఎక్కి పడుకున్నాడు. వాడి పని ఎలా ఉందో చూద్దామని ఓహ్ వెళ్లాడు. అక్కడ వాడు పడుకుని ఉండటం చూశాడు. వాడిని పట్టుకుని కట్టేశాడు. ఇంకా దుంగలు తెమ్మని పనివాళ్లకి పురమాయించాడు. ఆ కుర్రాడిని వాటిమీద పెట్టి నిప్పు అంటించాడు. ఆ కుర్రాడు బొగ్గులా కాలిపోయాడు. ఓహ్ వాడి అస్థికల్ని గాలిలోకి విసిరేశాడు. ఆ కుర్రాడి అవశేషంగా మిగిలిందల్లా ఒక చిన్న రవ్వ. కాని ఓహ్ దానిమీద కాసిని జీవజలం చల్లగానే ఆ కుర్రాడు ఎప్పట్లాగానే సజీవంగా లేచివచ్చాడు. కాని ఎప్పటికంటే ఎక్కువ బుద్ధీ చురుకూ వచ్చాయి.

మళ్లీ కట్టెలు కొట్టమని ఓహ్ వాడికి చెప్పాడు. కాని ఆ కుర్రాడు ముందటిలానే మళ్లీ నిద్రపోయాడు. ఓహ్ రెండోసారి దుంగలకి నిప్పు పెట్టాడు. వాడిని, అస్థికల్ని గాలిలో విసిరేశాడు. అవశేషంగా మిగిలిన రవ్వమీద జీవజలం చల్లాడు. మళ్లీ కుర్రాడు సజీవంగా వచ్చాడు.

వాడింక ఎంత మాత్రమూ పనికి మాలిన వాడిలా లేడు. మామూలుగా కనిపించే చురుకూ, యుక్తీగల కుర్రాడిలా అయ్యాడు. మాటల్లో చెప్పలేనంత అందంగా అయ్యాడు. ఒక ఏడాది గడిచింది.

అప్పుడు వాడెక్కడున్నాడో వెతికి వెనక్కి తీసుకువద్దామని వాడి నాన్న బయలుదేరాడు.

వాళ్ల నాన్న అదే అడవికి, అదే చెట్టుమొద్దు దగ్గరికి వెళ్లి దానిమీద కూర్చుని "ఓహ్" అన్నాడు.

చిత్రం! ఓహ్ ఆ మొద్దులోనుంచి ఇవతలికి వచ్చాడు.

"బాగున్నావా అయ్యా!" అన్నాడు.

"నువ్వు బాగున్నావా?" అన్నాడు కుర్రాడి తండ్రి.

"ఏం వచ్చావు?"

"మా అబ్బాయిని తీసుకెళదామని."

"రా, అయితే. నీ కొడుకుని గుర్తు పడితే తీసికెళ్లు. లేకపోతే వాడు నాతో ఇంకో ఏడాది ఉంటాడు."

అతను ఓహ్ వెనకాలే వాళ్ల ఇంటికి వెళ్లాడు. అక్కడికి వెళ్లగానే ఓహ్ ఒక కుంచెడు జొన్నలు తెచ్చాడు. ఇంటి ముందర నేలమీద జొన్నలని కుమ్మరించాడు. పెద్ద గుంపుగా కోడిపుంజులు వచ్చి వాటిని ముక్కుతో పొడిచి తినడం మొదలుపెట్టాయి.

"ఈ పుంజుల్లో నీ కొడుకెవరో చెప్పు," అన్నాడు ఓహ్. తండ్రి వాటికేసి చూశాడు. అతనికి అన్నీ ఒక్కలాగే కనిపించాయి. ఎంత తన్నుకున్నా వాటిల్లో ఏది తన కొడుకో చెప్పలేకపోయాడు.

"నువ్వింటికి వెళ్లు. నీ కొడుకు ఇక్కడ మరో ఏడాది ఉంటాడు," అని ఓహ్ అన్నాడు.

తండ్రి ఇంటికి వెళ్లిపోయాడు. రెండో ఏడు గడవగానే అతను తిరిగి అదే అడవికి, అదే చెట్టుమొద్దు దగ్గరికి వెళ్లాడు.

"ఓహ్," అని అన్నాడు.

చిత్రం! ఓహ్ అతని ముందు ప్రత్యక్షం అయ్యాడు.

"రా, ఈ సారి నీ కొడుకుని గుర్తుపట్టు," అన్నాడు.

ఓహ్ అతన్ని గొర్రెల మంద దగ్గరికి తీసికెళ్లాడు. గొర్రెలన్నీ ఒక్కలాగే కనిపించాయి. ఎంత పరకాయించి చూసినా తన కొడుకు ఎవరైందీ గుర్తుపట్టలేకపోయాడు.

"ఇంటికి వెళ్లిపో. నీ కొడుకు నాతో మరో ఏడు ఉంటాడు," అన్నాడు.

తండ్రి పుట్టెడు విచారంతో ఇంటికి వెళ్లిపోయాడు. ఏడాది గడవగానే మళ్లీ అడవికి బయలుదేరాడు. అలా నడుచుకుంటూ వెళుతూ ఉండగా అతనికి ఒక ముసలతను ఎదురు వచ్చాడు. ఆ ముసలతని జుట్టు ముగ్గుబుట్టలా నెరిసిపోయింది. పైనుంచి కిందదాకా మొత్తం తెల్ల బట్టలు వేసుకున్నాడు.

"ఏమయ్యోయ్," అన్నాడు ముసలతను.

"ఏం పెద్దాయనా."

"ఏందాకా ఏమిటి?"

"ఓహ్ దగ్గరికి, మా అబ్బాయిని తీసుకురావడానికి."

"నీ దగ్గరనుంచి వాడిని ఓహ్ ఎలా తీసుకెళ్లగలిగాడు?"

"అదో పెద్ద కథ."

ఓహ్‌కీ, తనకీ జరిగిన ఒప్పందం గురించి తండ్రి చెప్పాడు. "ప్చ్, ఏం బాగా లేదు. అతను నిన్నిలా ఆడిస్తూనే ఉంటాడు."

"మా అబ్బాయిని వెనక్కి తెచ్చుకోవడం ఎలాగో తెలీటం లేదు. నీకేమన్నా ఊహ తడితే చెప్పు."

"తడుతుందనుకుంటున్నాను," అన్నాడు ముసలతను.

"బాబ్బాబు, నీకు పుణ్యం ఉంటుంది ఏం చెయ్యమంటావో చెప్పు. ఎంత చెడ్డా నా కొడుకు నా రక్తమాంసాలు పంచుకుని పుట్టిన వాడు కదా. వాడిని నేను తీసికెళ్లాలి."

"సరే అయితే విను. నువ్వు ఓహ్ ఇంటికి వెళ్లగానే అతను పావురాళ్ల మందని వదిలి కాసిని గింజలు వాటి ముందు పోస్తాడు. ఒక పావురం ఆ గింజల్ని ఏరుకుని తినకుండా రెక్కల్ని తుడుచుకుంటూ ఒక రేగి చెట్టు కింద ఉంటుంది. ఆ పావురమే నీ కొడుకు," అని ముసలాయన చెప్పాడు.

తండ్రి ముసలతనికి కృతజ్ఞతలు చెప్పి వెళ్లిపోయాడు.

ఆ చెట్టు మొద్దు దగ్గరికి వెళ్లి "ఓహ్," అన్నాడు.

అప్పుడు ఓహ్ ప్రత్యక్షమయ్యాడు. అధోలోకంలో ఉన్న తన ఇంటికి అతన్ని తీసికెళ్లాడు. కాసిని గోధుమ గింజల్ని నేలమీద చల్లి పావురాళ్లని పిలిచాడు. పావురాళ్ల మంద వచ్చింది. అవి అన్నీ అచ్చు గుద్దినట్టు ఒక్కలాగే ఉన్నాయి.

"ఇప్పుడు చెప్పయ్యా ఈ పావురాళ్లలో ఎవరు నీ కొడుకో. నీ కొడుకు పావురాన్ని వీటిల్లోనుంచి ఏరుకోగలిగితే వాడు నీతో వస్తాడు. ఏరుకోలేకపోతే నా దగ్గరే ఉండిపోతాడు," అన్నాడు ఓహ్.

తండ్రి పావురాళ్లకేసి చూశాడు. అవి అన్నీ గోధుమ గింజలు ఏరుకుని తినడంలో మునిగిపోయి ఉన్నాయి. ఒక్కటి మాత్రం తినడం లేదు. అది మిగతా పావురాళ్లతో కలవకుండా దూరంగా ఉంది. ఒక రేగి చెట్టు కింద చేరి రెక్కలు తుడుచుకుంటూ ఉంది.

"ఆ పావురమే మా అబ్బాయి," అని దానికేసి చూపిస్తూ అన్నాడు తండ్రి.

"నిజమే! ఆ పావురమే నీ కొడుకు. నువ్వు వాడిని నీతో ఇంటికి తీసుకుపోవచ్చు," అన్నాడు ఓహ్.

అలా అని పావురాన్ని అందమైన యువకునిగా మార్చాడు. లోకంలో అంత అందమైన వాడు ఉండడు, అలా ఉన్నాడా యువకుడు.

తండ్రీ కొడుకులు సంతోషంతో ఉప్పొంగిపోయి, ఒకరినొకరు వాటేసుకుని, కౌగిలించుకుని ముద్దు పెట్టుకున్నారు.

"రా, ఇంటికి వెళదాం బాబూ," అన్నాడు తండ్రి.

వాళ్లు ఇంటికి బయలుదేరారు. ఒకరినొకరు ఆఖరిసారి చూసుకున్న దగ్గరనుంచీ, ఆ మూడేళ్లలోనూ తమకి కలిగిన అనుభవాలు వాళ్లు చెప్పుకున్నారు.

తాము ఎంత బీదవాళ్లుగా బతుకుతూన్నదీ కొడుక్కి చెప్పాడు తండ్రి.

"ఏం చేద్దాం బాబూ? నేను బీదవాడిని, నువ్వూ బీదవాడివి. మూడేళ్లు ఓహ్ కొలువు చేసినా నువ్వు ఏమీ సంపాదించలేదు," అన్నాడు తండ్రి.

"ఏం బెంగపడకు నాన్నా, ఏదో చేద్దాం. రాకుమారులు అడవిలోకి నక్కల వేటకి వస్తారు కదా. వాళ్లు కనిపించగానే నేను వేట కుక్కలాగా మారిపోయి నక్కని పట్టుకుంటాను. వాళ్లు నన్ను కొంటామంటారు. మూడు వందల రూబుళ్లకి నన్ను ఇచ్చెయ్యి. మనకి ఖర్చులుపోను మిగులుతుంది కూడా. కాని గుర్తు పెట్టుకో, నా గొలుసు వాళ్లకి ఇవ్వొద్దు," అన్నాడు కొడుకు.

వాళ్లు ముందుకు వెళ్లారు. అడవి శివారుకి రాగానే కొన్ని వేట కుక్కలు ఒక నక్కని తరమడం కనిపించింది. నక్క వాటి ముందు కనిపిస్తూనే ఉన్నాగానీ అవి నక్కని అందుకోలేకపోయాయి.

కొడుకు వెంటనే వేట కుక్కలాగా మారిపోయాడు. నక్క వెనకాల పడి దాన్ని పట్టాడు.

రాకుమారులు అడవిలోనుంచి పరిగెత్తుకుంటూ వచ్చారు.

"ఈ కుక్క నీదేనా?" అని వాళ్లు తండ్రిని అడిగారు.

"అవునయ్యా," అని అతను జవాబు చెప్పాడు.

"దీన్ని మాకు అమ్ముతావా?"

"తమ చిత్తం."

"ఏం ఇమ్మంటావ్?"

"మూడు వందల రూబుళ్లు. కాని గొలుసు లేకుండా."

"నీ తుక్కు గొలుసు ఎవడికి కావాలి? మేం కుక్కకి బంగారు గొలుసు చేయిస్తాం."

"సరే, ఇంద, సొమ్ము తీసుకో. కుక్కనిలా ఇయ్యి." వాళ్ళు డబ్బు లెక్కపెట్టి తండ్రికి ఇచ్చి కుక్కని తీసుకున్నారు. అప్పుడు ఆ కుక్కని మరో నక్క జాడ పట్టేందుకు అడవిలో వదిలారు. కుక్క

నక్కని అడవిలో కంటా తరిమింది. అక్కడ కుక్క రూపం మార్చుకుని ఎప్పటిలాగా కొడుకు రూపంలోకి వచ్చేసింది. వాడు తండ్రి దగ్గరికి తిరిగి వచ్చాడు.

తండ్రీ కొడుకూ మళ్లీ నడక సాగించారు.

"బాబూ, మన దగ్గరున్న డబ్బు ఎక్కువ ఖర్చులకి రాదు. కాడి పశువులకి కొంత, పనిముట్లకి కొంత ఖర్చవుతుంది," అన్నాడు తండ్రి.

"మరేం బెంగపడకు నాన్నా. ఇంకొంత మంది పడుచు రాకుమారులు పూరీడు పిట్టలను వేటాడుతూ వస్తారు. నేను డేగలాగా మారిపోతాను. వాళ్లు నన్ను కొంటామంటారు. నన్ను మూడు వందల రూబుళ్లకి అమ్ము. కాని మర్చిపోకు, వాళ్లకి నా పంజరం మాత్రం ఇవ్వొద్దు," అన్నాడు కొడుకు.

వాళ్లు ఒక పొలం దాటుతూ ఉండగా పూరీడు పిట్టలను వేటాడే రాకుమారులు తగిలారు. వాళ్లు ఒక డేగని వదిలారు. పూరీడు పిట్టలు ఆ డేగ కళ్ల ముందు కనిపిస్తూ ఉన్నా కూడా డేగ దేన్నీ పట్టలేక పోయింది. అప్పుడు కొడుకు డేగలాగా మారిపోయి ఒక పిట్టని పట్టాడు. రాకుమారులు తండ్రి దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చారు.

"ఆ డేగ నీదేనా?"

"అవునయ్యా," అని తండ్రి జవాబు చెప్పాడు.

"మాకు అమ్ముతావా?"

"తమ చిత్తం."

"ఏం ఇమ్మంటావ్?"

"మూడు వందల రూబుళ్లు, కాని పంజరం లేకుండా."

"నీ పాత పంజరం ఎవరికి కావాలి? కొత్తది చేయిస్తాం."

వాళ్లు కొంచెం సేపు బేరమాడుకున్నారు. కాని ఆఖరికి తండ్రి అడిగిన మొత్తం ఇచ్చారు. కాని ఆ డేగ అడవిలోకి వెళ్లగానే దానికి కొడుకు రూపం వచ్చేసింది. మళ్లీ కొడుకు తండ్రిని కలిశాడు.

"ఇప్పుడు మనకి సరిపడా సొమ్ము ఉంది," అన్నాడు తండ్రి.

"ఆగు నాన్నా, ఇంకా వస్తుంది. మనం ఒక సంతకి వెళదాం. నేను గుర్రంలాగా మారిపోతాను. నువ్వు నన్ను అమ్మకానికి పెట్టు. వెయ్యి రూబుళ్లకి అమ్ము. కాని జాగ్రత్త, నా కళ్లెం అమ్మకు," అని చెప్పాడు కొడుకు.

వాళ్లు ఒక చిన్న పట్టణం చేరారు. అక్కడ సంత జరుగుతోంది. కొడుకు గుర్రంలాగా మారిపోయాడు. ఆ గుర్రం ఎంత ఉగ్రంగా ఉందంటే దాని దగ్గరికి వెళ్లే ధైర్యం ఎవరికీ లేకపోయింది.

తండ్రి దాన్ని కళ్లెం పట్టుకుని తీసికెళ్లాడు. కాని గంతులు వెయ్యకుండా దాట్లు వెయ్యకుండా, నేలమీద గిట్టలతో తన్నకుండా దాన్ని ఆపలేకపోయాడు. వర్తకులు దాన్ని చూసి పరిగెత్తుకుంటూ వచ్చి బేరం మొదలుపెట్టారు.

"వెయ్యి రూబుళ్లు. కాని కళ్లెం లేకుండా," అని తండ్రి చెప్పాడు.

"ధర సగం తగ్గించు. నీ కళ్లెం నువ్వే ఉంచుకో. మేం దానికి వెండి కళ్లెం చేయిస్తాం," అన్నారు వాళ్లు.

"నేనడిగింది వెయ్యి రూబుళ్లు. నాకు వెయ్యే కావాలి," అన్నాడు అతను.

తండ్రి, గుర్రం చుట్టూ జనం గుంపుగా ఉన్నారు. అప్పుడు ఒక జిప్సీ వచ్చి ఆ గుంపులో చేరాడు. అతనికి ఒక కన్ను గుడ్డి అని తండ్రి చూశాడు.

"గుర్రానికి ఏమిమ్మంటావు?" అని జిప్సీ అడిగాడు.

"వెయ్యి రూబుళ్లు. కళ్లెం ఇవ్వను," అన్నాడు తండ్రి.

"అయ్య బాబోయ్! అంత ధరే! కళ్లెంతో కలిసి గుర్రానికి అయిదు వందలు ఇస్తాను."

"వీల్లేదు."

"ఆరు వందలు, ఏమంటావు?"

"వీల్లేదు."

వాళ్లు అలా బేరమాడుతూనే ఉన్నారు. కాని తండ్రి తను చెప్పిన ధరలో ఒక్క పైసా కూడా తగ్గించలేదు.

"సరే కానీ. వెయ్యీ తీసుకో," అన్నాడు జిప్సీ ఆఖరికి. "కాని కళ్లెం కూడా ఇచ్చెయ్యి," అన్నాడు.

"ఉహుఁ, కళ్లెం ఇవ్వను."

"చాలు! చాలు! కళ్లెం లేకుండా గుర్రాన్ని అమ్మడం ఎక్కడన్నా విన్నామా! ఏం పట్టుకుని నడిపించుకెళ్ళమంటావు దాన్ని?" అన్నాడు జిప్సీ.

"బాగుంది, అది నువ్వు చూసుకోవాలి," అన్నాడు తండ్రి.

"ఇదిగో ఇంకో అయిదు రూబుళ్లు తీసుకో. ఇంక నసగొద్దు," అన్నాడు జిప్సీ.

"సరే కానీ," అన్నాడు తండ్రి. కళ్లానికి అయిదు రూబుళ్లే! భలే బేరం! 'కళ్లెం ముప్పై కోపెక్కులు కూడా చెయ్యదుగా,' అని తనలో తాను అనుకుని సరే కానిమ్మన్నాడు.

బేరం ఫైసలు చేసుకున్న సూచనగా వాళ్లు తాగారు. తండ్రి డబ్బు తీసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. ఆ జిప్సీ అసలు జిప్సీ కాదు. అలా వేషం వేసుకున్న ఓహ్. ఆ గుర్రాన్ని తీసుకుని స్వారీ చేసుకుంటూ వెళ్లిపోయాడు.

గుర్రం చెట్లకంటే ఎత్తులో, మేఘాలకంటే దిగువలో దౌడు తీసింది. కాళ్లతో గింజుకుంటూ ఓహ్‌ని కిందికి తోసెయ్యాలని తంటాలు పడింది. కాని తొయ్యలేక పోయింది. కొంచెం సేపట్లోనే ఓహ్‌ని అతని రాజ్యానికి తీసుకు వచ్చింది. ఓహ్ అడవి పక్కనే దిగి, గుర్రాన్ని శాలకి నడిపించుకుంటూ వెళ్లాడు. తర్వాత అతడు ఇంట్లోకి వెళ్లిపోయాడు.

"మొత్తంమీద వీడు నానుంచి తప్పించుకుపోలేదు," అని పెళ్లాంతో అన్నాడు ఓహ్.

మధ్యాహ్నం అయింది. ఓహ్ కళ్లెం పుచ్చుకుని గుర్రాన్ని నది దగ్గరికి నడిపించుకుని వెళ్లాడు. గుర్రం నీళ్లమీదకి ఒంగింది. నీళ్లు తాగడానికి బదులు ఓ చేపలాగా మారి ఈదుకుంటూ పోయింది. ఓహ్ వెంటనే తనూ ఓ పెద్ద చేపలాగా మారి ఆ చేప వెంటబడ్డాడు. ఇక పట్టుకోబోయేంతలోనే ఆ చేప రెక్కల్ని కొమ్మల్లా చాచి, తోక తిప్పింది. దాంతో పెద్ద చేప ఏమీ చెయ్యలేకపోయింది. ధైర్యంగా వెళ్ళగలిగినంత దగ్గరకు వెళ్లి "బాబ్బాబు, చిన్న చేపా! నాకేసి తిరుగు మాట్లాడుకుందాం," అని పెద్ద చేప రూపంలో ఉన్న ఓహ్ అన్నాడు.

"ఈ దూరంలో నువ్వు చెప్పేది వినిపిస్తూనే ఉందిలే," అని చిన్న చేప జవాబు చెప్పింది. పెద్ద చేప దాని వెంటబడినా దాన్ని అందుకోలేకపోయింది.

చిన్న చేప ఒడ్డు దగ్గరికి ఈదుతూ వెళ్లింది. ఒక రాకుమారి అక్కడ జలకాలాడుతూ ఉండడం చూసి కెంపు పొదిగిన ఉంగరంలాగా మారిపోయింది. రాకుమారి ఆ ఉంగరాన్ని చూసి, నీటిలోనుంచి తీసి తండ్రికి చూపించడానికి ఇంటికి పట్టుకెళ్లింది.

"నాకు ఎంత చక్కని ఉంగరం దొరికిందో చూడు," అంటూ చూపించింది.

చక్రవర్తి ఉంగరం చాలా బాగుంది అని మెచ్చుకున్నాడు. రాకుమారికి ఆ ఉంగరం ఎంత అందంగా కనిపించిందో చెప్పలేం. ఏ వేలికి పెట్టుకోవాలో ఆమెకి తెలీనే లేదు.

అలా కొంత కాలం గడిచింది. ఒక ముసలి వర్తకుడు తమ దర్శనార్థం వచ్చాడని పరిచారకులు చక్రవర్తితో చెప్పారు.

చక్రవర్తి తన మందిరంలోనుంచి వర్తకుడిని చూసేందుకు వచ్చాడు.

"ఏం కావాలి ముసలాయనా?" అని వర్తకుడిని అడిగాడు.

ఆ వర్తకుడెవరో కాదు, ఆ వేషంలో వచ్చిన ఓహ్.

"నేను ఓడలో సముద్రం దాటుతూ ఉండగా కెంపులు పొదిగిన ఉంగరం ప్రమాదవశాత్తూ నీళ్లల్లో పారేసుకున్నాను మహాప్రభూ! నేను దాన్ని మా రాజుగారి కోసం తీసుకు వెళుతున్నా. తమరి పాలితులకి ఎవరికైనా దొరికిందేమో వాకబు చేయిస్తారని వచ్చాను," అన్నాడు.

"మా అమ్మాయికి దొరికిందది," అన్నాడు చక్రవర్తి.

రాకుమారిని పిలిపించారు. ఉంగరాన్ని ఇమ్మనమని ఓహ్ ప్రాధేయపడ్డాడు. అది తనకు ప్రాణంతో సమమైందని, తిరిగి ఇవ్వడానికి ఆమె ససేమిరా ఒప్పుకోలేదు.

చక్రవర్తి కూడా ఓహ్‌తోబాటుగా ఆమెని బతిమిలాడాడు.

"ఇచ్చెయ్యమ్మా. ఉంగరం ఇవ్వకపోతే వాళ్ల రాజు ఇతన్ని దండిస్తాడు, పాపం కదా," అని నచ్చచెప్పాడు.

"సరే ఈ ఉంగరం ఎవరికీ ఉండకూడదు," అంటూ ఆమె దాన్ని నేలమీదకి విసిరేసింది. చిత్రంగా, అది బద్దలై గోధుమ గింజలుగా మారి నేల మీదంతా చెదిరిపోయాయి.

వెంటనే ఓహ్ కోడిపుంజులాగా మారి ఆ గింజల్ని పొడుచుకు తినడం మొదలుపెట్టాడు. అన్నిటినీ తినేశాడు. ఒక్కటి మాత్రం మిగిలిపోయింది. అతను దాన్ని చూడలేదు. అది రాకుమారి చెప్పు కిందకి దొర్లిపోయింది. ఓహ్ తర్వాత కిటికీలోనుంచి ఎగిరి బయటికి పోయి తన రాజ్యానికి వెళ్లిపోయాడు.

రాకుమారి అడుగు పక్కకి వెయ్యగానే ఆ గింజ అందమైన యువకుడిగా మారిపోయింది. ఆ యువకుడి సౌందర్యం చూడగానే రాకుమారి అతడిని ప్రేమించింది. అతడిని పెళ్లి చేసుకుంటాననీ, అందుకు ఒప్పుకొమ్మని చక్రవర్తినీ, రాణినీ బతిమిలాడింది.

"అతనితోనే నాకు జీవితానందం ఉంది, మరి ఎవరితోనూ కాదు," అంది.

తన కూతురు ఒక సాధారణ యువకుడిని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక చక్రవర్తి మొదట తటపటాయించాడు. రాణీతో మాట్లాడి ఆఖరికి ఒప్పుకున్నాడు. చక్రవర్తీ, రాణీ ఆ పడుచు జంటని ఆశీర్వదించి, గొప్ప విందు చేశారు. లోకంలో సగం మందిని ఆహ్వానించారు.

నేనూ వెళ్లాను. విందు వినోదాల్లో పాల్గొన్నాను. తాగిన మధువుల్లో ఒక్క చుక్క కూడా గొంతుక దిగలేదు, అంతా గడ్డం మీదనుంచి జారిపోయింది.

అందుకనే, నా నల్లని గడ్డం ముగ్గు బుట్టలా తెల్లగా మారింది.





ISBN 978-93-80153-58-2

మంచి పుస్తకం